


దువ్వూరు సమీపంలోని ఆనకట్ట వద్ద నీటిలో సూర్యుడి ప్రతిబింబం

వీఆర్వోలపై జేసీ ఆగ్రహం

బి.కోడూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): బి.కోడూరు మండల పరిధిలో రీసర్వేకు సంబంధించి పనితీరు సక్రమంగా లేదంటూ వీఆర్వోలపై జేసీ అదితిసింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామసభ అర్జీలపై పరిశీలించేందుకు బుధవారం వచ్చిన ఆమెకు రైతులు తమ సమస్యలు తెలుపుకున్నారు. పాయలకుంట్ల, తిప్పరాజుపల్లె గ్రామాల్లో రీసర్వే పేరుతో తమను మోసం చేశారని రైతులు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆమె మాట్లాడుతూ కొంత టైం ఇవ్వండి, మీ సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. వీఆర్వోల పనితీరు సక్రమంగా లేదని, వారు ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని జేసీకి ఫిర్యాదు చేశారు. దీంతో వీఆర్వోలపై జేసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం గ్రామసభల్లో ఎన్ని అర్జీలు వచ్చాయి, వాటికి ఎంతవరకు పరిష్కారం జరిగింది అనే విషయంపై రెవెన్యూ రికార్డులు పరిశీలించారు. ఆమె వెంట ఆర్డీవో చంద్రమోహన్, తహశీల్దారు మధునాయక్, వీఆర్వోలు పాల్గొన్నారు.


రీసర్వేతో నష్టపోయామంటూ జేసీ అదితిసింగ్‌కు విన్నవిస్తున్న రైతులు



విజయదుర్గాదేవి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా అమ్మవారికి విశేష పంచామృతాభిషేకం చేస్తున్న దృశ్యం

శివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలి

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి మహోత్సవాలకు ఏర్పాట్లు పటిష్టంగా నిర్వహించి విజయవంతం చేయాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ఈ నెల 25వ తేదీ నుంచి 27వ తేదీ వరకు జిల్లాలోని అన్ని ప్రముఖ శైవ క్షేత్రాల్లో మహాశివరాత్రి ఉత్సవ నిర్వహణ ఏర్పాట్లపై ఎస్పీ అశోక్ కుమార్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, ఏఎస్పీ ప్రకాశ్ బాబు, దేవదాయ ధర్మదాయ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్, నగర కమిషనర్ మనోజ్‌రెడ్డితో కలిసి కలెక్టర్ సమావేశం నిర్వహించారు. జిల్లాలో ముఖ్యమైన 13 శైవ క్షేత్రాలకు లక్షలాది మంది భక్తులు హాజరవుతారన్నారు. వారందరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, ఈఓలు, చైర్మన్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

టీడీపీలోకి మరో కౌన్సిలర్

● త్వరలో వైసీపీ ఖాళీ : బీటెక్ రవి


పులివెందుల టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇలాకాలో మరో కౌన్సిలర్ టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మరికొందరు లైన్‌లో ఉన్నారని, త్వరలో వైసీపీ ఖాళీ అవుతుందని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి అన్నారు. బుధవారం బీటెక్ రవి ఆధ్వర్యంలో పులివెందుల మున్సిపాలిటీ కె.వెలమవారిపల్లె 13వ వార్డు కౌన్సిలర్ రంగనాయకులు యాదవ్‌తో పాటు పలువురు టీడీపీలో చేరారు. ఇదివరకే 30వ వార్డు కౌన్సిలర్ షాహిద టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ త్వరలో మరికొంత మంది టీడీపీలోకి వస్తారన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి చూసి వైసీపీ నాయకులు టీడీపీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. గత ప్రభుత్వంలో చేసిన పనులకు బిల్లులు రాకపోడంతో వైసీపీ శ్రేణులు నిరాశతో ఉన్నాయన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో పులివెందుల మున్సిపాలిటీని టీడీపీ కైవసం చేసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి తూగుట్ల మధుసూధన్‌రెడ్డి, వేంపల్లె మండల ఇన్‌చార్జి రఘునాథరెడ్డి, నల్లగారి భాస్కర్‌రెడ్డి, మహబూబ్ బాషా, పట్టణ అధ్యక్షుడు అన్నారెడ్డి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కౌన్సిలర్ రంగనాయకులు యాదవ్‌ను పార్టీలోకి కండువా కప్పి ఆహ్వానిస్తున్న బీటెక్ రవి

కాకెత్తుకు పోయింది..!

● సింగపూర్ టౌన్‌షిప్‌లో అభివృద్ధి చేసిన పార్కు ఏదీ..?

● ఒక్క పనీ చేయకనే.. పార్కు అభివృద్ధి పేరుతో రూ.25.50లక్షలు నొక్కేశారు



(కడప-ఆంధ్రజ్యోతి): ఔను.. మీరు చదివింది అక్షరాలా నిజమే. పార్కు ఏంటి, కాకెత్తుకెళ్లడమేంటి అని ఆశ్చర్యపోతున్నారు కదూ. 1990వ సంవత్సరంలో వచ్చిన వెంకటేశ్ సినిమా 'శత్రువు' గుర్తుందా. ఆ సినిమాలో కట్టని హాస్టలు బిల్డింగులో విద్యార్థులు ఉన్నట్లు.. వారికి భోజనాలు మెస్‌చార్జీల పేరుతో భారీగా ప్రభుత్వం నుంచి విలన్ పాత్రధారి కోటా శ్రీనివాసరావు డబ్బు కొట్టేస్తుంటారు. అయితే స్కూలు బిల్డింగు కూలిపోయిందంటూ వెంకటేశ్ కోర్టులో కేసు వేస్తారు. అది పెద్ద ఇష్యూ అవుతుంది. చివరకు బిల్డింగు కట్టలేదని ఒప్పుకుంటారు. అలాగే 2009లో పోసాని క్రిష్ణమురళి హీరోగా వచ్చిన సినిమా 'రాజుగారి చేపలచెరువు' గుర్తుంది కదా. తవ్వని చెరువు తవ్వినట్లుగా చూపించి మా చెరువు ఎవరో దొంగలు ఎత్తుకెళ్లారంటూ పోలీసుస్టేషన్‌లో కేసు పెడతారు. ఇది కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంది. అది రీల్ లైఫ్. అయితే రియల్ లైఫ్‌లో కూడా ఆ స్థాయిలో మనోళ్లు కట్టనిపార్కు కట్టినట్లు చూపించి ప్రభుత్వ సొమ్ము రూ.25.50లక్షలు కాజేశారు. ఇది ఎక్కడో మారు మూల ప్రాంతంలో జరిగింది కాదు.. కడప కార్పొరేషన్‌లోనే ఈ స్వాహా జరగడం ఇప్పుడు వెలుగులోకి వచ్చింది.

కడప నగర శివారులోని రిమ్స్ వద్ద సింగపూర్ టౌన్‌షిప్ 2010 నాటికే ఏర్పడింది. ఇక్కడ మొత్తం 470 గృహాలున్నాయి. 2010 నుంచి జనాలు నివాసం ఉంటూ వస్తున్నారు. ఓ విధంగా ఇది గేటెడ్ కమ్యూనిటీ తరహాలో ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం పట్టణాల్లో అమృత్ ద్వారా తాగునీటి పథకాలు, పార్కుల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా సింగపూర్ టౌన్‌షిప్‌లో 2.22 ఎకరాల్లో రూ.98 లక్షలతో పార్కు ఏర్పాటు చేయాలని 2016-17 సంవత్సరాలో నిర్ణయించారు. సింగపూర్ టౌన్‌షిప్ ఏర్పడేటప్పుడే అక్కడ పార్కు, ఇతర వాటి కోసం ఖాళీ స్థలాలు వదిలారు. అయితే అమృత్ ద్వారా ఏర్పాటు చేసేది ఓపెన్ పార్కు కావడం, బయట నుంచి జనాలు వచ్చే అవకాశం ఉండడంతో అప్పట్లో స్థానిక మహిళలు అభ్యంతరం తెలిపారు. దీంతో పార్కు పనులు జరగలేదు. అయితే ఇటీవల సింగపూర్ టౌన్‌షిప్‌నకు చెందిన ఓ వ్యక్తి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అమృత్ స్కీం ద్వారా కడపలో ఎక్కడెక్కడ పార్కులు అభివృద్ధి చేశారు.. ఎంత కేటాయించారు.. సింగపూర్ టౌన్‌సిప్‌లో పార్కుకు ఎంత డబ్బులు కేటాయించారు.. ఎంత విస్తీర్ణంలో పార్కు నిర్మించారో వివరాలు కోరారు. కడప కార్పొరేషన్ అధికారులు 2015-16లో హౌసింగ్ బోర్డు కాలనీ పా ర్కు అభివృద్ధికి రూ.25లక్షలు, హౌసింగ్ బోర్డు, ఎస్‌బీఐ కాలనీ, జర్నలిస్టుకాలనీ అభివృద్ధితో పాటు 2016-17లో సింగపూర్ టౌన్‌షిప్‌లో 2.25 ఎకరాల్లో రూ.98లక్షలతో పార్కు అభివృద్ధికి శ్రీకారం చుట్టామని.. ఇందులో భాగంగా సింగపూర్ టౌన్‌షిప్‌లోని పార్కు అభివృద్ధికి రూ.25.50 లక్షలు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. అయితే అక్కడ అసలు పార్కు డెవలప్ చేయకపోవడం గమనార్హం. ఇప్పుడీ వ్యవహారం టౌన్‌షిప్‌లో హాట్‌టాపిక్‌గా మారింది. రూ.25.50లక్షలు నొక్కేసిన అసలు దొంగలెవరో అధికారుల విచారణలో తేలాల్సి ఉంది.



నలుగురు అధికారుల ఇంక్రిమెంట్లలో కోత

● రూ.33.50 లక్షలు రికవరీ

● ఒక ఎంపీడీవో సహా ముగ్గురు ఇంజనీర్లకు జుల్మానా

● ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

కలికిరి/కమలాపురం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కమలాపురంలో పనిచేసిన నలుగురు అధికారులపై భారీ స్థాయిలో చర్యలు చేపడుతూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. పదేళ్ల క్రితం అక్కడ ఎంపీడీవోగా పనిచేసిన బి.హరిబాబుకు రెండు ఇంక్రిమెంట్లు, అసిస్టెంట్ ఇంజనీరు ఎస్.సుబ్రమణ్యంకు రెండు ఇంక్రిమెంట్లు, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈఈగా పనిచేసిన కె.విజయకుమార్‌కు ఒక ఇంక్రిమెంటు, కడప పీఐయూ ఏఈఈ కేఎస్ జిలాన్‌కు రెండు ఇంక్రిమెంట్లు ప్రభుత్వం నిలుపుదల చేసింది. అంతేగాకుండా ఈ నలుగురు అధికారుల నుంచి మొత్తం రూ.33,50,180లు వసూలు చేయాలని కూడా ఆదేశించింది.

కమలాపురం మండలంలో 2012లో రూ.కోట్ల విలువైన పనులు జరిగాయి. దాదాపు పది రకాల ప్రభుత్వ పథకాల ద్వారా అందిన నిధులతో ఈ పనులు చేపట్టారు. వీటిపై అందిన ఫిర్యాదుల ఆధారంగా 2014లో విజిలెన్స్ అధికారులు క్షుణ్ణంగా దర్యాప్తు చేపట్టి పెద్ద ఎత్తున నిధులు దుర్వినియోగమైనట్లు నిర్ధారించారు. ఈ మేరకు సమగ్ర నివేదికను ప్రభుత్వానికి 2014 అక్టోబరులో సమర్పించారు. దీని ఆధారంగా 8 మంది పైన అభియోగాలు నమోదు చేస్తూ ప్రభుత్వం అధికారులకు సంజాయిషీ నోటీసులు జారీ చేసింది. అధికారుల పంపుకొన్న సంజాయిషీలు సంతృప్తికరంగా లేకపోవడంతో రిటైర్డ్ ఐపీఎస్ అధికారి జె.సత్యనారాయణతో కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీస్‌ను ఏర్పాటు చేశారు. ఆ తరువాత విచారణకు సుదీర్ఘకాలం పట్టడంతో కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీస్‌ను కూడా మార్చాల్సి వచ్చింది. ఎంక్వయిరీ కమిషన్ కూడా ఈ నలుగురిపై అభియోగాలను నిర్ధారిస్తూ నివేదిక అందజేసింది. దీంతో ఈ నలుగురు అధికారుల నుంచి దుర్వినియోగమైన నిధులను రాబట్టాలని, వారి ఇంక్రిమెంట్లలో కోత విధించాలని విజిలెన్స్ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఈ మేరకు ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. మరో నలుగురిపై తీసుకున్న చర్యల గురించి ఉత్తర్వులు రావలసి ఉంది. ఇందులో ప్రస్తుతం ఏపీ టిడ్కో జనరల్ మేనేజరుగా పనిచేస్తున్న అప్పటి కమలాపురం ఎంపీడీవో హరినాథ బాబుకు రెండు ఇంక్రిమెంట్లు కోత విధించి రూ.8,68,604ను, ఏఈ సుబ్రమణ్యంకు రెండు ఇంక్రిమెంట్ల కోతతోపాటు రూ.20,05,361లను, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ కేఎస్ జిలాన్‌కు రెండు ఇంక్రిమెంట్లు కోతతో పాటు రూ.2,27,409లను, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈఈ విజయకుమార్‌కు ఒక ఇంక్రిమెంటు కోత విధించి రూ.2,48,806లను రికవరీ చేయాల్సిందిగా ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఈ మేరకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ బుధవారం వేర్వేరుగా నాలుగు ఉత్తర్వులు జారీ చేశారు.



అభివృద్ధి ఏదీ..?

ప్రొద్దుటూరు మున్సిపల్ పరిధిలో రూ.కోట్ల విలువచేసే ఆస్తులున్నా వాటిని అభివృద్ధి చేసి ఆదాయాన్ని పెంచుకునే దిశగా పాలకులు, అధికారులు దృష్టి సారించడం లేదు. బొల్లవరం మున్సిపల్ లేఅవుట్‌లో కనీస వసతులైన రోడ్లు, కాలువలు, విద్యుత్, తాగునీటి సదుపాయం ఏర్పాటు చేయడంలో గతం మున్సిపల్ పాలకులు విఫలం అయ్యారు. ప్లాట్ల అమ్మకం ద్వారా మున్సిపాలిటీకి రూ.14 కోట్ల మేర ఆదాయం వచ్చినా అక్కడ మౌలిక వసతులు కల్పించలేదు. దీంతో రూ.వందల కోట్ల విలువ చేసే ఇంటి స్థలాలు నిరుపయోగంగా ఉన్నాయి.

● మున్సిపల్ లేఅవుట్‌లో.. ప్లాట్ల విక్రయాలతో రూ.14 కోట్ల ఆదాయం

● ఐదేళ్ల వైసీపీ పాలనలో పైసా ఖర్చుపెట్టని వైనం

● కనీసం మట్టిరోడ్లు కూడా లేని దుస్థితి

● రూ.వందల కోట్ల విలువ చేసే స్థలం నిరుపయోగం

● ఇదీ బొల్లవరం మున్సిపల్ లేఅవుట్ స్థితి


ప్రొద్దుటూరు మున్సిపల్ ప్లాట్లలో పెరిగిన జంబు

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపాలిటీ 1984లో హడ్కో రుణంతో జమ్మలమడుగు మార్గంలోని మెయిన్ రోడ్డుకు ఆనుకుని బొల్లవరం రెవెన్యూ పొలంలో దాదాపు 85.15 ఎకరాల భూములను కొనుగోలు చేసింది. ఆ భూములను మొత్తం 761 ప్లాట్లుగా విభజించారు. ఇందులో ఓపెన్ స్పేస్ కింద 10 శాతం అంటే 8.5 ఎకరాల భూములను పార్కులు ఇతర సామాజిక అవసరాల కోసం వదిలారు. 24.74 ఎకరాలను విశాలమైన రోడ్ల నిర్మాణం కోసం వదిలారు. ఇందులో హెచ్ఐజీ ప్లాట్లు 95, ఎంఐజీ ప్లాట్లు 147 ఏర్పాటు చేశారు. వీటిని సెంట్ల వారీగా 7.5 సెంట్లు, 5.5 సెంట్లు, 2.5 సెంట్లు ప్లాట్లుగా విభజించి బహిరంగ వేలం ద్వారా విక్రయించారు. 2007-2008 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన వేలంలో సెంటు రూ.70వేల నుంచి రూ.2 లక్షలతో విక్రయించారు. మొత్తం 761లో 243 ప్లాట్లను విక్రయించారు. ఇంకా 518 ప్లాట్లు ఉన్నాయి. విక్రయించిన ప్లాట్లకు నాడు రూ.14 కోట్ల మేర మున్సిపాలిటీకి ఆదాయం సమకూరింది.

అర్ధంతరంగా ఆగిన పనులు

బొల్లవరం మున్సిపల్ లేఅవుట్‌లో ప్లాట్ల విక్రయం ద్వారా వచ్చిన ఆదాయంతో అక్కడ రూ.5 కోట్లతో మెటల్ రోడ్డు, విద్యుత్ స్తంభాలు, తాగునీటి పైపులైను పనులు నాడు చేపట్టారు. ఓవర్ హెడ్ టాంక్ నిర్మాణం సైతం మొదలు పెట్టారు. అనంతరం ఆ పనులు అసంపూర్తిగా వదిలేశారు. మౌలిక వసతులు కల్పించకపోవడంతో ప్లాట్లు కొన్నవారు నిర్మాణాలు చేపట్టలేదు. కొన్నేళ్లుగా మున్సిపాలిటీ పట్టించుకోక పోవడంతో విద్యుత్ స్తంభాలకున్న తీగలు చోరీకి గురయ్యాయి. లే అవుట్‌లో జంబు పిచ్చిమొక్కలు పెరిగి ఘోరంగా ఉంది. దీంతో కొందరు ప్రైవేటు భవన నిర్మాణాల వ్యర్థాలను మున్సిపల్ లేఅవుట్ లోని ఖాళీ స్థలాల్లో వేస్తున్నారు.

నిషేధిత జాబితాలో పెట్టడంతో..

మున్సిపాలిటీ కొనుగోలు చేసిన 85.51 ఎకరాలలో 70.09 ఎకరాలు పట్టాల్యాండ్ ఉంది. అందులో 52.46 ఎకరాలను 2017లో 22-ఏ కింద నిషేధిత జాబితాలో పెట్టారు. దీంతో ఆ భూముల్లో క్రయవిక్రయాలు ఆగిపోయాయి. మున్సిపల్ అధికారులు కలెక్టరుకు రిపోర్టు పంపడంతో వాటిని 22-ఏ జాబితా నుంచి తొలగించారు. ప్రస్తుతం ఇందులో ఒక్క ఎకరా మాత్రమే రస్తా పొరంబోకు ఉంది.

'రియల్' వ్యాపారంతో పెరిగిన ధరలు

ప్రొద్దుటూరు చుట్టుపక్కల 5కి.మీ వరకు భూముల ధరలు భారీగా పెరిగాయి. మున్సిపల్ లేఅవుట్‌లో ఒకప్పుడు సెంటు రూ.2లక్షలు ఉండగా.. ఇప్పుడు రూ.10లక్షలకు పైగా పలుకుతోంది. రోడ్డుమీదకు రూ.15 లక్షల వరకు ఉంది. ప్రస్తుతం ఈ ప్లాట్లలో మౌలిక వసతులు కల్పించి బహిరంగ వేలం పెట్టి విక్రయిస్తే మున్సిపాలిటీకి రూ.వందల కోట్ల ఆదాయం వస్తుంది. లేఅవుట్ అభివృద్ధి చేయడం ద్వారా అక్కడ నిర్మాణాలు చేపడితే ఇంటి ప్లాను రుసుం, ఇంటి పన్నుల రూపేణ ఆదాయం సమకూరుతుంది. ఆ దిశగా మున్సిపాలిటీ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరలో పనులు చేపడతాం..

బొల్లవరం మున్సిపల్ లేవుట్‌లో రూ.54 లక్షలతో గ్రావెల్ రోడ్లు, రూ.14 లక్షలతో ప్లాట్లకు మార్కింగ్ రాళ్లు పాతే పనులు చేపట్టడానికి జనవరి 31 కౌన్సిల్ ఆమోదం కోసం పెట్టాం. అలాగే లేఅవుట్‌లో పనులు పూర్తి కాగానే ప్లాట్లకు బహిరంగ వేలం వేసి విక్రయించేందుకు కౌన్సిల్ సైతం ఆమోదం తెలిపింది. త్వరలో టెండర్లు పిలిచి పనులు చేపడతాం. బహిరంగ వేలం నిర్వహించి ప్లాట్లు విక్రయించి మున్సిపాలిటీకి ఆదాయం సమకూర్చి ప్రొద్దుటూరు పట్టణ అభివృద్ధిని వేగవంతం చేస్తాం.

- వి.మల్లికార్జున, మున్సిపల్ కమిషనర్, ప్రొద్దుటూరు


మున్సిపల్ లే అవుట్‌లో అసంపూర్తిగా నిలిచిపోయిన వాటర్ ట్యాంక్


లేఅవుట్‌లోని పార్కు దుస్థితి

దేవుడా... కుటుంబం మొత్తాన్ని తీసుకెళ్లావా...!

- నిన్న భర్త, ఇద్దరు పిల్లలు... నేడు భార్య మృతి
- ఘోర రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మహిళ కన్నుమూత





మృతిచెందిన కవిత, ఇన్‌సెట్‌లో కవిత (ఫైల్)

ములకలచెరువు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): దేవుడా... ఎంత పని చేశావయ్యా... కుటుంబం మొత్తాన్ని తీసు కెళ్లిపోయావా. అభం.. శుభం తెలియని చిన్నారుల సహా పెద్దల వరకు అందరికీ నూరేళ్లు నిండి పోయాయా అంటూ బంధువులు, గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. నిరుపేద కుటుంబం మొత్తాన్ని రోడ్డు ప్రమాదం కబలించింది. రోడ్డు ప్రమాదంలో భర్త, ఇద్దరు పిల్లలు మృతి చెందగా... నేడు భార్య కన్ను మూసింది. ములకలచెరువు షాదీమహల్ సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద రెండు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన సోమశేఖర్, అతని కుమారుడు రెడ్డిశేఖర్, కుమార్తె సిద్దేశ్వరిలు మృతి చెందగా, సోమశేఖర్ భార్య కవిత తీవ్రంగా గాయపడ్డ సంఘటన తెలిసిందే. ఈ క్రమంలో తిరుపతి రూయాలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో కవిత బుధవారం ఉదయం మృతి చెందింది. దీంతో కుటుంబంలో ఒకరు కూడా మిగలకుండా మొత్తం రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లయింది. కవిత మృతదేహానికి తిరుపతి రూయాలోనే పోస్టుమార్టం నిర్వహించి అంత్యక్రియల నిమిత్తం బి.కొత్తకోట మండలం బయప్పగారిపల్లె పంచాయతీ కుమ్మరపల్లెకు తరలించారు. రోడ్డు ప్రమాదంలో కుటుంబం మొత్తం మృతి చెందడంతో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా మృతి చెందిన సోమశేఖర్ తండ్రి మద్దిలేటికి ముగ్గురు సంతానం. వీరిలో మొదటి కుమారుడు రాజశేఖర్, రెండవ సంతానం ఉషారాణి కాగా మూడవ సంతానం మృతి చెందిన సోమశేఖర్. నిరుపేద కుటుంబానికి చెందిన సోమశేఖర్ కుటుంబ అంత్యక్రియలు సోదరి ఉషారాణి స్వగ్రామమైన కుమ్మరపల్లెలో నిర్వహించారు.

కుక్కల దాడిలో ఆరు పొట్టేళ్లు మృతి



కుక్కల దాడిలో మృతి చెందిన పొట్టేళ్లు

గాలివీడు, ఫిబ్రవరి12 (ఆంధ్రజ్యోతి): కుక్కలు దాడి చేయడంతో ఆరు పొట్టేళ్లు మృతి చెందినట్లు మండలంలోని నూలివీడు పంచాయతీ ఆవులరెడ్డిగారిపల్లెకు చెందిన నరసింహారెడ్డి తెలిపారు. మంగళవారం రాత్రి తన ఇంటికి సమీపంలోని దొడ్డిలో తోలిన పొట్టేళ్లపై కుక్కలు దాడి చేశాయని, బుధవారం ఉదయం తాను వెళ్లి చూసేసరికి ఐదు పొట్టేళ్లు మృతి చెంది కనిపించాయని తెలిపాడు. ఒక్కో పొట్టేలు రూ.15 వేల విలువ చేస్తుందని వివరించారు.

రేషన్ బియ్యం.. దందా...!







ములకలచెరువులో ఎండీయూ వాహనం వద్ద రేషన్ బియ్యం తీసుకుంటున్న రేషన్‌కార్డుదారులు (ఫైల్)

- తంబళ్లపల్లె నుంచి కర్ణాటకకు అక్రమంగా రవాణా
- ప్రతి నెలా లబ్ధిదారులకు 11,500 క్వింటాళ్ల బియ్యం పంపిణీ
- సగానికిపైగా పక్కదారి..?
- ఇక్కడ రూ.15 నుంచి రూ.20కి కొనుగోలు
- కర్ణాటకలో రూ.35 నుంచి రూ.40కి అమ్మకాలు
- గ్రామాల్లోకి వచ్చి ఉచిత బియ్యం కొంటున్న వ్యాపారులు
- చెక్‌పోస్టులు ఎత్తేయడంతో అడ్డూ అదుపు లేకుండా తరలింపు

ములకలచెరువు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. తంబళ్లపల్లె నియోజకవర్గం నుంచి కర్ణాటకకు ప్రభుత్వ చౌకధరల దుకాణ బియ్యం అక్రమంగా రవాణా అవుతోంది. వ్యాపారస్తులు నేరుగా లబ్ధిదారుల వద్దకు వెళ్లి బియ్యం కొనుగోలు చేసి కర్ణాటకకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం మండలాల సరిహద్దులోనే కర్ణాటక రాష్ట్రం ఉండడంతో అక్రమ రవాణాకు సులువుగా మారింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కర్ణాటక సరిహదుల్లో ఉన్న చెక్‌పోస్టులను ఎత్తేయడంతో బియ్యం అక్రమ రవాణాకు అడ్డూ అదుపు లేకుండాపోయింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా సరిహదుల్లో ఉన్న చెక్‌పోస్టులను పునఃప్రారంభించి బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాల్సి ఉంది.

తంబళ్లపల్లె నియోజవర్గంలోని తంబళ్లపల్లె, ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట, కురబలకోట, పెద్దమండ్యం మండలాల్లో ప్రభుత్వం ప్రతి నెలా రేషన్‌కార్డుదారులకు ఉచిత బియ్యం అందిస్తోంది. కార్డులో ఎంతమంది ఉంటే అంత మందికి ఒక్కొక్కరికి ఐదు కేజీల చొప్పున పంపిణీ చేస్తోంది. ఉచితంగా అందిస్తున్న రేషన్ బియ్యాన్ని వ్యాపారస్తులు లబ్ధిదారుల వద్దకు వెళ్లి నగదు ఆశ చూపడంతో పాటు మభ్యపెట్టి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. నాణ్యత లేకనో, తినడానికి ఇబ్బంది ఉందనో పలువురు లబ్ధిదారులు రేషన్ బియ్యాన్ని విక్రయిస్తున్నారు. వ్యాపారస్తులు నేరుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి కిలో రూ.15 నుంచి రూ.20కి కొనుగోలు చేస్తున్నారు. ఈ బియ్యాన్ని అక్రమంగా కర్ణాటకకు తరలించి అక్కడ రూ.35 నుంచి రూ.40 వరకు అమ్ముతున్నారు. రోజువారీ ధరలను బట్టి కర్ణాటకలో రేషన్ బియ్యం కొనుగోళ్లు జరుగుతున్నాయి. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ప్రతి నెలా సుమారు 11,500 కింటాళ్ల రేషన్ బియ్యాన్ని ప్రభుత్వం ఉచితంగా రేషన్‌కార్డుదారులకు అందిస్తోంది. ఇందులో సగానికిపైగా వ్యాపారస్తులు కొనుగోలు చేస్తూ కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్నారు.

సన్నబియ్యంగా మార్చి ఇక్కడికే తిరిగి రవాణా...?

ఈ ప్రాంతం నుంచి కర్ణాటకకు అక్రమంగా రవాణా అవుతున్న రేషన్ బియ్యాన్ని సన్న బియ్యంగా మార్చి ఇక్కడికే తరలించి అమ్మకాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక్కడి నుంచి వెళ్లిన రేషన్ బియ్యంను మిల్లుల్లో పాలిష్ చేసి సన్న బియ్యంగా మారుస్తున్నారు. సన్నబియ్యంగా మార్చిన రేషన్ బియ్యాన్ని కొత్త రంగురంగుల సంచుల్లో 25 కేజీలు ప్యాకింగ్ చేసి ఈ ప్రాంతంలోని దుకాణాలకు వేసి అమ్మకాలు చేస్తున్నట్లు సమాచారం. అలాగే సన్నబియ్యంగా మార్చిన రేషన్ బియ్యం కర్ణాటకలోని పలు ప్రాంతాలకు అక్కడి వ్యాపారస్తులు తరలించి విక్రయిస్తున్నారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో ఈ దందా యథేచ్ఛగా సాగింది. ప్రస్తుతం కూడా అలాగే జరుగుతోంది. విచ్చలవిడిగా సాగుతున్న రేషన్ బియ్యం అక్రమ రవాణాపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని అడ్డుకట్టవేయాలని పలువురు కోరుతున్నారు.

చెక్‌పోస్టులు మూతపడడంతో సాఫీగా అక్రమ రవాణా



పెద్దతిప్పసముద్రం మండలంలోని కర్ణాటక సరిహద్దుల్లో మూతపడ్డ మారుగానిపల్లె, చెంద్రాయునిపల్లె చెక్‌పోస్టులు

తంబళ్లపపల్లె నియోజకవర్గంలోని బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం మండలాలు కర్ణాటక సరిహద్దుకు ఆనుకుని ఉన్నాయి. దీంతో రేషన్ బియ్యం అక్రమ రవాణాకు అనుకూలంగా మారింది. గతంలో ఆంధ్ర-కర్ణాటక సరిహద్దుల్లో పోలీస్ చెక్ పోస్టులు ఏర్పాటు చేసి అందులో సిబ్బందిని ఉంచి వాహనాల తనిఖీ చేపట్టడంతో కొంతమేరకు అక్రమ రవాణాకు అడ్డుకట్టపడింది. గత వైసీపీ ప్రభుత్వం ఈ చెక్‌పోస్టులను రెండేళ్ల పాటు ఉంచి తరువాత ఎత్తేసింది. దీంతో రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న చెక్‌పోస్టులు మూతపడ్డాయి. సిబ్బంది కూడా విధుల్లో లేరు. ఈ నేపథ్యంలో తంబళ్లపల్లె నియోజకవర్గం నుంచి అక్రమంగా రవాణా అవుతున్న రేషన్ బియ్యంకు అడ్డులేకుండాపోయింది. బి.కొత్తకోట మండలం తానామరిమిట్ట, బడికాయలపల్లె, పెద్దతిప్పసముద్రం మండలంలోని మారుగానిపల్లె, అంకాలమడుగు, మల్లెల క్రాస్, టి.సదుం వద్ద కర్ణాటక రాష్ట్ర సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు మూతపడ్డాయి.

అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు

రేషన్ బియ్యాన్ని ఎవరైనా అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేయిస్తాం. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాల్లో నిరంతరం ప్రత్యేక నిఘా ఉంచాం. ప్రతిరోజూ సరిహద్దుల్లో వాహనాల తనిఖీ చేపడుతున్నాం. రేషన్ బియ్యం ఎవరైనా అక్రమంగా రవాణా చేస్తే తక్షణం మాకు సమాచారం అందించాలి.

- వెంకటరెడ్డి, సీఎస్ డీటీ, బి.కొత్తకోట

విద్యుత్తులైన్‌పై పడిన ఉడుత

- జంపర్లు కట్.. హైవోల్టేజీ సరఫరా
- సబ్‌కలెక్టరేట్‌లో విద్యుత్తుకు అంతరాయం



తెగిపోయిన విద్యుత్తు జంపర్లు



ప్రమాదానికి కారణమైన ఉడుత

మదనపల్లె, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయానికి విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఇదే కార్యాలయం ఆవరణంలోని సబ్‌స్టేషన్ నుంచి కార్యాలయానికి, బంగ్లాకు విద్యుత్తు సరఫరా అవుతోంది. సబ్‌స్టేషన్‌కు సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌కు సరఫరా అవుతున్న 11 కేవీ వైర్లపై చింతమాను పైనుంచి ఉడుత దూకిందని విద్యుత్తు శాఖ అధికారులు చెబుతున్నారు. దీంతో ఉడుత విద్యుత్తు షాక్‌తో కాలి కిందపడిపోగా, వైర్ల జంపర్లు తెగిపోవడంతో సరఫరా ఆగిపోయింది. ఈ క్రమంలో భూమికి ఎర్త్ కావడంతో హైవోల్టేజీ సరఫరా అయినట్లు చెబుతున్నారు. ఫలితంగా సబ్‌కలెక్టర్ కార్యాలయంతో పాటు బంగ్లాలోనూ విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడి, కార్యాలయంలో రెండు కంప్యూటర్లు, ఒక ఏసీ, సెల్‌ఫోన్ చార్జర్ కాలిపోయినట్లు తెలిసింది. దీంతో సబ్‌స్టేషన్ నుంచి ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్తు సరఫరా నిలిపేశారు. ఈ మార్గం గుండా కాకుండా ఫోర్‌పోల్స్ విధానంలో డీపీ స్విచ్ ఏర్పాటు చేసి ట్రాన్స్‌ఫార్మర్‌కు అనుసంధానం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఇబ్బంది తలెత్తకుండా విద్యుత్తులైన్‌ను వేరు చేశారు. సోమవారం ఉదయం 7గంటల ప్రాంతంలో జరిగిన ఈ సంఘటన నేపథ్యంలో తాత్కాలిక ఏర్పాట్లు చేపట్టారు. అనంతరం బుధవారం సాయంత్రం లైన్‌ను ఏర్పాటు చేసి సరఫరాను పునరుద్ధరించారు. ఇందులో ఈఈ గంగాధర్, ఏడీఈ హరికుమార్, ఏఈలు అక్కడే ఉంటూ పనులు పూర్తి చేశారు.

బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయండి

- జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌వో మధుసూదనరావు

రాయచోటి కలెక్టరేట్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదనరావు అధికారులను ఆదేశించారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్‌లోని డీఆర్‌వో చాంబర్‌లో ఈ నెల 23 నుంచి మార్చి 5 వరకు జరగబోయే వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై జిల్లా దేవదాయశాఖ, పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులతోపాటు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాకు తలమానికమైన భద్రకాళీ సమేత వీర భద్రస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఈ ఉత్సవాలకు సుమారు రెండు లక్షల మంది భక్తులు రానున్న నేపథ్యంలో ఉచిత దర్శనం, వసతి, భోజనం, తాగునీరు తదితర వసతుల కల్పనపై ఆలయ ఈవో అధికారులతో సమన్వయం చేసుకొని పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. బ్రహ్మోత్సవాల సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యుత్‌శాఖ అధికారిని ఆదేశించారు. పోలీసుశాఖ, రోడ్లు భవనాలశాఖ, విద్యుత్ శాఖల సమన్వయంతో రథోత్సవాన్ని నిర్వహించాలన్నారు. హెల్త్ క్యాంపులను ఏర్పాటు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. ఈ సమావేశంలో దేవదాయశాఖ జిల్లా అధికారి విశ్వనాథ్, వీరభద్రస్వామి ఆలయ ఈవో రమణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ వాసు, రాయచోటి తహసీల్దార్ పుల్లారెడ్డి, విద్యాశాఖ అధికారి శివప్రకాశ్‌రెడ్డి, జిల్లా ప్రజా రవాణా శాఖ, రహదారులు, భవనాలశాఖ, ఎక్సైజ్‌శాఖ, విద్యుత్‌శాఖ, అగ్ని మాపక శాఖ, తదితరశాఖల అధికారులు పాల్గొన్నారు.

విధులకు డుమ్మా...

- ఏడుగురు పంచాయతీ సిబ్బందికి షోకాజ్ నోటీసులు



గురుగుపల్లి సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో జవహర్‌బాబు

గాలివీడు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): విధులకు డుమ్మా కొట్టిన ఏడుగురు పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లను వివరణ కోరుతూ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఎంపీడీవో జవహర్ బాబు తెలిపారు. బుధవారం సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంపీడీవో పలుచోట్ల సచివాలయం సిబ్బంది ముందస్తు అనుమతులు లేకుండా గైర్హాజరు కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో వివిధ సచివాలయాలకు సంబంధించి గైర్హాజరైన వారు రసూల్‌బాషా (పంచాయతీ కార్యదర్శి పూలుకుంట- ఈనెల 3 నుంచి గైర్హాజరు సచివాలయం మూసివేశారు), జె.మదన్‌మోహన్ (పంచాయతీ కార్యదర్శి, గుండ్లచెరువు, డిసెంబరు 28 నుంచి అనుమతి లేకుండా గైర్హాజరు), ఎ.భార్గవి వీఆర్‌వో (పూలుకుంట, అరవీడు- ఈనెల 1 నుంచి అనుమతి లేకుండా గైర్హాజరు, సర్వేల పట్ల నిర్లక్ష్యం), పి.జ్యోతి (జీఎంఎస్‌కే, పూలుకుంట- నవంబరు 30 నుంచి ముందస్తు అనుమతి లేకుండా గైర్హాజరు), కె.లావణ్య (ఇంజనీరింగ్ అసిస్టెంట్, పూలుకుంట- డిసెంబరు 20 నుంచి ముందస్తు అనుమతి లేకుండా గైర్హాజరు), కేవీ సుధాకర్ (వీఆర్‌వో, గురుగుపల్లి- సర్వేలకు సహకరించడం లేదు), టీఎస్ యశోదమ్మ (వీఆర్‌వో, గుండ్లచెరువు- సర్వేలకు సహకరించడం లేదు) వీరు ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా సచివాలయాలను వదిలి విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ గైర్హాజరు కావడంతో రెండు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆయన నోటీసుల్లో పేర్కొన్నారు.

లాభదాయకం.. ఉద్యానం

- ఏపుగా పెరిగిన చీనీ చెట్లు
- ఎకరాకు ఏడాదికి రూ.1.5లక్షల ఆదాయం



ఏపుగా పెరిగిన చెట్లలో కాయలు, పూతను చూపుతున్న రైతు శివారెడ్డి



డ్రమ్ముల్లో ఉన్న జీవామృతం

చాపాడు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రైతుల ఆలోచన మారుతోంది. ప్రతిఏటా వేసే పంటలతో వచ్చే అరకొర ఆదాయంతో విసుగుచెంది రైతులు పంటల మార్పిడికి శ్రీకారం చుడుతున్నారు. ముఖ్యంగా ఉద్యాన పంటల సాగుతో రైతులు మంచి లాభాలు గడిస్తున్నారు. చాపాడు మండలంలో ప్రతి ఏడాది రైతులు కేసీకెనాల్, చాపాడు చానెల్, వ్యవసాయ ఫిల్టర్ల కింద వరి, పసుపు, నువ్వులు సాగు చేస్తుంటారు. కానీ కష్టానికి తగిన ఆదాయం లభించలేదని రైతులు ఉద్యానవన పంటలవైపు దృష్టి సారించారు. వెదురూరు, రాజుపాళెం, అనంతపురం, నరహరిపురం, నక్కలదిన్నె, రాజువారిపేట, సీతారామపురం, కేతవరం తదితర గ్రామాల రైతులు సుమారు 200 ఎకరాల్లో జామ, చీనీ మొక్కలు నాటారు. ఏడేళ్ల క్రితం నాటిన మొక్కలు ఏపుగా పెరిగి కాయలు కాసి మంచి పంట దిగుబడి ఇస్తున్నాయి. పంట దిగుబడి ఎక్కువగా ఉండడం, రేటు కూడా బాగుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పొలాల్లోనే కొనుగోలు

జామకాయలు, చీనీ పండ్లను తాడిపత్రి, మల్లేల, నంది మండలం ప్రాంతాలకు చెందిన వ్యాపారులు పొలాల వద్దకే వచ్చి నగదు చెల్లించి కొనుగోలు చేస్తున్నట్లు రైతులు తెలిపారు. జామ, చీనీ మొక్కలను నాటినా ఏడాది నుంచే కాపుకొస్తున్నాయి. మూడవ ఏడాది నుంచి దిగుబడి ఎక్కువగా ఉంటుందని రైతులు తెలిపారు. ఒక ఎకరాలో చీనీ పండ్లు ఆరు నెలల కాలంలో 42 టన్నుల దిగుబడి వచ్చినట్లు తెలిపారు. ఒక టన్ను రూ.40 వేల నుంచి రూ.55 వేల వరకు ధర పలికిందన్నారు. ఒక ఎకరాకు ఖర్చులు పోను రూ.1.50 లక్షలు ఆదాయం మిగిలినట్లు ఓ రైతు తెలిపారు.

90 శాతం సబ్సిడీతో డ్రిప్

డ్రిప్ పద్ధతిలో ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. వీటికి పది టన్నుల పశువులపేడ, 150 కిలోల సింగిల్ సూపర్, పొటాష్, 15 కిలోల నత్రజని ఉపయోగిస్తున్నారు. అలాగే జీవామృతం నెలకు రెండుసార్లు ఎరువుగా వాడుతున్నారు. తిరుపతిలోని వ్యవసాయ యూనివర్శిటీకి చెందిన శాస్త్రవేత్తలు శ్రీనివాసులరెడ్డి, మహిళా శాస్త్రవేత్త ముకుంద ఈ పంటలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్నారు. ఈ చెట్ల వేర్లకు కుళ్లు తెగుళ్లు రాకుండా ట్రైకోడెర్మా, సూడోమొనాస్ అనే మందులు వాడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం 90 శాతం సబ్సిడీతో ఇచ్చిన డ్రిప్ పరికరాలు, పైపులతో ప్రతి చెట్టుకు నీటిని అందించేందుకు రైతులకు సులభంగా ఉంది. మొత్తానికి చెట్లు ఏపుగా పెరిగి మంచి దిగుబడి ఇస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చీనీ చెట్లతో మంచి ఆదాయం

పది ఎకరాల్లో జంబోరా రకం చీనీ తోట వేశాను. ఏడు సంవత్సరాల క్రితం ఈ మొక్కలు నాటాను. ఇప్పుడు బాగా పెరిగి పంట దిగుబడి వస్తోంది. ఎకరాకు 40 నుంచి 45 టన్నుల చీనీ పండ్లు పండుతున్నాయి. ఏడాదిలో రెండుసార్లు కోతకు వస్తున్నాయి. ఏడాదికి ఎకరాకు రూ.1.50 లక్షల ఆదాయం వస్తోంది. ఇంతకుమునుపు వేరుశనగ, వరి సాగు చేసేవాడిని. ఆ పైర్లు గిట్టుబాటు కాకపోవడంతో చీనీ సాగు చేశాను. చీనీ చెట్లకు జీవామృతం, పశువుల పేడ ఎక్కువగా వాడుతున్నాను. డ్రిప్ పద్ధతిలో నీరందిస్తున్నా. తిరుపతిలోని వ్యవసాయ యూనివర్శిటీ శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటిస్తున్నా.

- లోమడ శివారెడ్డి, రైతు, వి.రాజుపాళెం గ్రామం

వివాదాస్పదమైన నిర్మాణాల నిలిపివేత

- రెవెన్యూ అధికారుల తీరుపై అనుమానాలు



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న తహసీల్దారు, మండల సర్వేయర్, తదితరులు

పీలేరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పీలేరు పట్టణం నాగిరెడ్డి కాలనీలో బుధవారం జరిగిన ఓ ఇంటి నిర్మాణ పనుల నిలిపివేత వివాదాస్పదంగా మారింది. నిర్మాణదారుల వద్ద ఉన్న పత్రాలకు, రెవెన్యూ రికార్డుల్లో ఉన్న వివరాలకు సరిపోవడం లేదని నిర్మాణ పనులను రెవెన్యూ అధికారులు నిలిపివేశారు. అయితే ఈ నెల 2వ తేదీన ఆ పత్రాలు సరైనవేనని రెవెన్యూ అధికారులే ధ్రువీకరించినట్లు తేలడంతో వివాదం ఏర్పడింది. కేవలం పది రోజుల వ్యవధిలో తమ పత్రాలు ఎలా తారుమారు అవుతాయని నిర్మాణదారులు ప్రశ్నిస్తుండడంతో రెవెన్యూ అధికారుల వ్యవహారశైలిపై అనుమానాలకు తెరలేపింది.

పీలేరు పట్టణం కోటపల్లెకు చెందిన ఓ.కళావతమ్మ, సి.గీతలకు నాగిరెడ్డి కాలనీలోని సర్వే నెం.72/2లో అప్పటి రెవెన్యూ అధికారులు 2014లో ఇంటి నివేశన పట్టాలు మంజూరు చేశారు. తమకు కేటాయించిన ఆ స్థలంలో పట్టాదారులు రెండు రోజులుగా ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించారు. ఆ నిర్మాణాలపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. ఉన్నతాధికారుల ఆదేశాలతో పీలేరు రెవెన్యూ అధికారులు బుధవారం స్థల పరిశీలన జరిపారు. నిర్మాణదారులు అందజేసిన పట్టాలకు, రెవెన్యూ రికార్డుల్లో ఉన్న పట్టాలకు సరిపోవడం లేదని తెలియజేస్తూ బుధవారం మధ్యాహ్నం పీలేరు తహసీల్దారు భీమేశ్వరరావు, మండల సర్వేయర్ కిరణ్మయి తమ బృందంతో నిర్మాణ పనులు ఆపివేశారు. ఆ స్థలం ప్రభుత్వానిదని, అందులో ఎటువంటి నిర్మాణాలు చేయకూడదని ఒక హెచ్చరిక బోర్డును సైతం ఏర్పాటు చేశారు. అయితే తమకు అక్కడ 2014లో ఇంటి నివేశన పట్టాలు మంజూరు చేశారని, ఆ పట్టాలు సరైనవేనని గతంలో రెవెన్యూ అధికారులు సమాచార హక్కు చట్టం ద్వారా అడిగిన సమాచారం మేరకు లిఖిత పూర్వకంగా తెలియజేశారని పట్టాదారులు తెలిపారు. ఈ నెల 2న కూడా ప్రస్తుత మండల సర్వేయర్ సర్వే చేసి సర్వే నెం.72/2లో ఇంటి పట్టాలు ఉన్నాయంటూ నిర్ధారించారని తెలిపారు. కేవలం 10 రోజుల వ్యవధిలో రికార్డులు ఎలా మారిపోతాయని ఆయన ప్రశ్నించారు. రాజకీయ కారణాలతో రెవెన్యూ అధికారులు తమ నిర్మాణాలను ఆపివేశారని, తాము నిర్మాణాలు ఆపేది లేదని స్పష్టం చేశారు. ఈ సంఘటన బుధవారం పీలేరులో చర్చనీయాంశమైంది. నిర్మాణాలు కొనసాగుతున్న విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు గురువారం చర్యలకు ఉపక్రమించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ వివాదం ఏ మలుపు తీసుకుంటుందో వేచి చూడాలి.



హెచ్చరిక బోర్డు తొలగించి పనులు చేసుకుంటున్న నిర్మాణదారులు

సోలార్ వెలుగులు

- జోరుగా సాగుతున్న విద్యుత్తు ప్లాంట్ పనులు
- పనులు పూర్తయితే వెయ్యి మెగా వాట్ల విద్యుత్తు ఉత్పత్తి

మైలవరం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వద్దిరాల, దొడియం, నక్కవానిపల్లె గ్రామాల కొండ ప్రాంతాల్లో 750 మెగావాట్ల విద్యుత్తు ప్లాంట్ పనులు జోరుగా సాగుతున్నాయి.


సోలార్ ప్యానెళ్లను అమర్చుతున్న కూలీలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యుత్తు ప్లాంట్ పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఆదానీ సంస్థ 250 మెగావాట్లు, స్వింగ్ కంపెనీ 250 మెగావాట్లు, హయ్యానా సంస్థ 250 మెగావాట్లతో విద్యుత్తు ప్లాంట్ పనులు ప్రారంభమయ్యాయి. దాదాపు 2,500 కోట్లకుపైగా పెట్టుబడులతో చురుగ్గా ప్యానెల్, కార్నల్ తదితర పనులు సాగుతున్నాయి. ఈ పనులు పూర్తయితే మైలవరంలో మొత్తం వెయ్యి మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది.

వైసీపీ హయాంలో నిలిచిన పనులు

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సోలార్ పనులు నిలిచిపోయాయి. 2019 ఎన్నికలకు ముందు టీడీపీ హయాంలో తలమంచిపట్నం, రామచంద్రాయపల్లె, పొన్నంపల్లె గ్రామాల మధ్య కొండ ప్రాంతంలో 250 మెగావాట్ల విద్యుత్తు ప్లాంట్ పనులు పూర్తయి విద్యుత్తు ఉత్పత్తి అయ్యేందుకు అప్పటి ప్రభుత్వం కృషి చేస్తే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం మిగిలిన 750 మెగావాట్ల విద్యుత్తు పనులు చేయడంలో నిర్లక్ష్యం చేశారు. వైసీపీ హయాంలో పనులు నత్తనడకన నడిచాయని స్థానికులు చెబుతారు. 2024లో ఎన్డీయే కూటమి అధికారంలోకి రావడంతో 750 మెగావాట్ల విద్యుత్తు ప్లాంట్ పనులకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో పనులు చకచకా సాగుతున్నాయి. ప్యానల్ పనులు, రోడ్లు,


సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేసిన దృశ్యం

విద్యుత్తు, వైరింగ్, తదితర పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఆదానీ, స్వింగ్, హయానా 750 మెగావాట్ల విద్యుత్తు ప్లాంట్ల పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇది కూడా జూన్, జూలై చివరికల్లా సోలార్ విద్యుత్తు ప్లాంట్ పనులు పూర్తయి విద్యుత్తు ఉత్పత్తి ప్రారంభించనున్నట్లు సంబంధిత అధికారి తెలిపారు.

బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ ప్రాజెక్టు

మైలవరంలో ఉత్పత్తి అయ్యే విద్యుత్తును గ్రిడ్‌కు అనుసంధానం చేసేందుకు అవసరమైన నెట్‌వర్క్‌కు బదులు 400 మెగ్గావాట్ల సామర్థ్యంతో బ్యాటరీ, స్టోరేజీ ప్రాజెక్టు ప్రతిపాదించారు. దొడియం గ్రామం వద్ద అతి పెద్ద అల్ట్రా సోలార్ ప్రాజెక్టు నిర్మాణం అవుతోంది. దీంతో మైలవరంలో సోలార్ వెలుగులు వెలుగనున్నాయి.

కనులపండువగా శ్రీవారి బ్రహ్మరథోత్సవం


రథోత్సవంలో భారీగా పాల్గొన్న భక్తులు

పులివెందుల రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణంలో శ్రీవారి బ్రహ్మరథోత్సవం కన్నులపండువగా జరిగింది. స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం ఉదయం 10.30గంటల సమయంలో పద్మావతి సమేత కళ్యాణవేంకటరమణస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన రథంపై శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కొలువుదీరారు. ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రథంపై కొలువుదీరిన స్వామివారిని భక్తులు దర్శించుకొని కాయ కర్పూరం సమర్పించారు. అనంతరం బ్రహ్మరథాన్ని ముందుకు కదిలించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి రథాన్ని లాగారు. ఈ సందర్భంగా కోలాట ప్రదర్శనలు, భజనలు అలరించాయి. శ్రీవారి రథోత్సవం పాతబస్టాండ్ నుంచి పూలంగళ్ల మీదుగా నిర్వహించగా.. అడుగడుగునా భక్తులు కాయకర్పూరం సమర్పించి మొక్కుకున్నారు. ఈసందర్భంగా గోవిందన్నామస్మరణలతో పులివెదుల పట్టణం మారుమోగింది. సీఐ నరసింహులు, ఎస్ఐ నారాయణ పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహించారు.

నేత్రపర్వం...శ్రీవారి చక్రస్నానం


వసంతోత్సవంలో స్వామిని ఊరేగిస్తున్న వేదపండితులు

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోసువారిపల్లెలో కొలువైన ప్రసన్న వేంకటరమణ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. బ్రహ్మోత్సవాల్లో చివరి ఘట్టమైన శ్రీవారి చక్రస్నానం బుధవారం భక్తుల కోలాహలం మధ్య వైభవంగా జరిగింది. టీటీడీ వేదపండితులు వేకువజామునే శ్రీవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించి నిత్య కైంకర్యాలు పూర్తి చేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా వసంతోత్సవం నిర్వహించి, స్వామివారిని ఆలయ మాడ వీధుల్లో వైభవంగా ఉరేగించారు. భక్త లు అడుగడుగునా స్వామి వారికి కర్పూర హారతులు సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. తదనంతరం ఆలయ వాహన మండపంలో వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ శ్రీదేవీ, భూదేవి సమేత ఉత్సవమూర్తులకు, శ్రీవారి సుదర్శన చక్రతాళ్వార్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గంగాళంలోని జలంలో ముంచి చక్రస్నానం నిర్వహించారు. సాయం త్రం ఆలయ ధ్వజస్తంభం పైకి సకల దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించేందుకు ఆరంభంలో ఎగురేసిన గరుడ ధ్వజపటాన్ని అవరోహణం గావించా రు. గురువారం ఉదయం శ్రీవారికి స్నపన తిరుమంజనం, సాయంత్రం పుష్పయాగంతో వార్షిక బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి, ఉపప్రధాన అర్చకులు కృష్ణప్రసాద్‌భట్టర్, అర్చకులు రమేష్ స్వామి టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఒంగోలుజాతి ఆవుకు కవల దూడలు



సికెదిన్నె, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఒంగోలుజాతి ఆవుకు ఒకేసారి రెండుదూడలు జన్మించినట్లు వేపమానుసత్రం గ్రామానికి చెందిన రైతు క్రిష్ణానాయక్ తెలిపారు. ఈ ఆవు 15 ఈతలు ఈనిందని, గతంలోనూ ఈ ఆవుకు కవల దూడలు జన్మించాయన్నారు. పశువైద్యులు నాగరాజు, సహాయకులు కిశోర్ ఆధ్వర్యంలో ఈ ఆవుకు గర్భధారణ చేశారు. బుధవారం ఆవుకు రెండు లేగదూడలు పూర్తి ఆరోగ్యంగా జన్మించడంతో హర్షం వ్యక్తం చేశారు.

10 మంది జూదరులు అరెస్టు

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలం గోపవరం పంచాయతీ జ్యోతినగర్‌లో జూదం ఆడుతున్న 10మంది పేకాటరాయుళ్లను బుధవారం త్రీటౌన్ సీఐ గోవిందరెడ్డి ఆధ్వర్యంలో పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.50,520 నగదును స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు అయిన వారిలో రమణారెడ్డి, మద్దిలేటిరెడ్డిలతో పాటు మరో 8 మంది వున్నారు. వీరిపై త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సీఐ గోవిందరెడ్డి తెలిపారు.

గ్యాస్ లీకేజీతో రూ.2లక్షలు ఆస్తినష్టం


మంటలను ఆర్పుతున్న ఫైర్‌సిబ్బంది

బి.కోడూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాజుపాలెం గ్రామానికి చెందిన బొడుకొండు తిరుపాల్‌రెడ్డి ఇంటిలో గ్యాస్ లీకేజీ కావడంతో మంటలు ఎగిసిపడటంతో ఇంటిలోని వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయి. దీంతో దాదాపు రూ.2లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. బుధవారం ఉదయం ఇంటిలో గ్యాస్‌పై వంట చేస్తుండగా సిలిండరు లీకేజీ కావడంతో మంటలు వ్యాపించాయి. ఫైరింజనుకు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. అప్పటికే ఇంటిలో ఉన్న బీరువా, ఫ్రిజ్, టీవీ తదితర వస్తువులన్నీ కాలిబూడిద య్యాయని వాపోయారు. ఈసంఘటనపై ఎస్ఐ సీపీ రాజు విచారిస్తున్నారు.

కోడిపందెంరాయుళ్లు అరెస్టు

సికెదిన్నె, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబుళంపల్లె సమీపంలో బుధవారం కోడిపందెంరాయుళ్లను అరెస్టు చేసినట్లు సీకేదిన్నె సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు. గ్రామ సమీపంలోని కంపచెట్లలో కోడిపందేలు ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి మూడు కోడిపుంజులు, రూ.750 నగదు, 8 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నీళ్లట్యాంకర్ బోల్తా.. యువకుడి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ హృషికేశ్వర్‌రెడ్డి

కొండాపురం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమలాయపల్లె గ్రామానికి చెందిన విశ్వనాథ్(15) అనే యువకుడు బుధవారం నీళ్లట్యాంకర్ బోల్తాపడి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. రాగికుంట వద్ద నున్న ఆదానీ కంపెనీకి తిరుమలాయపల్లె నుంచి విశ్వనాథ్ ట్రాక్టర్ నీళ్లట్యాంకర్ తీసుకెళుతుండగా మలుపులో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో విశ్వనాథ్‌కు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ హృషికేశ్వర్‌రెడ్డి తెలిపారు. మైనర్‌కు ట్రాక్టర్ ఇచ్చినందుకు ట్రాక్టర్ ఓనర్‌పై కూడా కేసు నమోదు చేయనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వేరుశనగ పైరుకు నిప్పు

గాలివీడు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): వేరుశనగ పైరుకు నిప్పంటించారని మండల పరిధిలోని పూలుకుంట హరిజనవాడకు చెందిన వర్ల నారాయణమ్మ బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సర్వే నెంబర్ 699 బీ2లో రెండు ఎకరాల్లో తాను వేరుశనగ పైరు సాగు చేశానని, ఈ భూమికి వేసిన కంచెకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పైరు కాలిపోయిందని ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

వైభవం కుంభాభిషేకం

- వేడుకగా శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవుని కల్యాణం
- ముగిసిన బ్రహ్మోత్సవాలు


తాళిబొట్టు చూపెడుతున్న వేద పండితులు

వల్లూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పవిత్ర పాపాఘ్ని నదీ తీరాన పైడికాల్వలో కొలువైన రాజ్యలక్ష్మి సమేత చెన్నకేశవ బ్రహ్మోత్సవాల్లో కుంభాభిషేకం వైభవంగా సాగింది. బుధవారం ఉదయాన్నే సుప్రభాత సేవ, అనంతరం కలశ ఆవాహన చేసి కలశానికి ఉద్వాసన తెలిపారు. అనంతరం దాదాపు 108 రకాల సుగంధ ద్రవ్యాలతో మహాపూర్ణాహుతి నిర్వహించి యజ్ఞం వేసి ప్రధాన అర్చకులు హరినారాయణశర్మ ఆధ్వర్యంలో పూర్ణాహుతి గావించారు. అనంతరం కుంభాభిషేకం మంగళవాయిద్యాల నడుమ మూలవిరాట్టు రాజ్యలక్ష్మి సమేత చెన్నకేశవ ఆలయ పరిదేవతలందరికీ కుంభాభి షేకం వేద పండితులు శాస్త్రోక్తంగా చేపట్టారు.

కల్యాణం వైభోగమే

బ్రహ్మోత్సవాల అనంతరం శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ మూలవిరాట్టును సుందరంగా అలంకరించి కోలాటాలు, మంగళ వాయిద్యాలు, వేద మంత్రాల నడుమ కల్యాణవేదిక వద్దకు తీసుకువచ్చారు. కంకణ ధారణతో కన్యాదానం నిర్వహించారు. తరువాత స్వామివారికి పాద ప్రక్షాళన గావించి జీలకర, బెల్లం ఆ దేవదేవేరుల శిరస్సుపై ఉంచారు. అనంతరం మాంగల్యం తంతునానేనా లోకరక్షణ హేతునా అంటూ శ్రీదేవి భూమి మెడల్లో చెన్నకేశవస్వామి మాంగల్యాన్ని అలంకరించారు. ముత్యాల తలంబ్రాలను శిరస్సుపై పోశారు. ఆలయ ప్రధానార్చకులు హరినారాయణశర్మ ఆధ్వర్యంలో మహామంగళహారతి గావించారు. భక్తులకు తీర్థ, అన్న ప్రసాదాలు అందించారు. రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ బ్రహ్మోత్సవాల్లో వల్లూరు నుంచే కాక కడప, అన్నమయ్య, అనంతపురం తదితర జిల్లాల నుంచి కూడా భక్తులు పాల్గొని బ్రహ్మోత్సవాలు తిలకించారు.

రుయా నేత్రనిధికి కళ్లు దానం


లీలావతి కళ్లను దానం చేస్తున్నట్లు ధ్రువీకరణ పత్రాన్ని టెక్నీషియన్‌కు అందజేస్తున్న ఆమె కుటుంబసభ్యులు

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గుండె సంబంధిత వ్యాధితో చికిత్స పొందుతూ మృతిచెందిన లీలావతి(61) కళ్లను ఆమె కుమారుడు సిద్ధారెడ్డి రుయాస్పత్రిలోని నేత్రనిధికి దానం చేశాడు. కడప జిల్లా చియ్యపాడుకు చెందిన లీలావతి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుండటంతో కుటుంబ సభ్యులు రుయాస్పత్రికి తీసుకువచ్చారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆమె బుధవారం మృతిచెందారు. దీంతో విషయం తెలుసుకున్న కంటి విభాగాధిపతి డాక్టర్ చలపతిరెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులకు కళ్ల దానం చేయడం వల్ల చూపులేని మరొకరికి కంటి వెలుగు ప్రసాదించే అవకాశం ఉంటుందంటూ అవయవదానంపై అవగాహన కల్పించారు. లీలావతి కుమారుడు సిద్ధారెడ్డి తన తల్లి కళ్లను దానం చేసేందుకు ముందుకు వచ్చారు. ఆయన అనుమతితో నేత్ర విభాగ టెక్నీషియన్ రమేష్ సహకారంతో మృతురాలి కళ్లను సేకరించి రుయాస్పత్రిలోని నేత్రనిధిలో భద్రపరిచారు. తల్లిని కోల్పోయిన దుఖంలోనూ ఆమె కళ్లను దానం చేసేందుకు ముందుకు వచ్చిన సిద్ధారెడ్డిని వారి కుటుంబ సభ్యులను రుయా అధికారులు అభినందించారు. ఈసందర్భంగా కంటి విభాగాధిపతి చలపతిరెడ్డి మాట్లాడుతూ ఎవరైనా మృతిచెందితే సకాలంలో వారి కళ్లను దానం చేయడం వలన కంటి చూపులేని మరొకరికి కంటి వెలుగు ప్రసాదించవచ్చన్నారు. కళ్లను దానం చేయాలనుకునే వారు రుయాస్పత్రిలోని నేత్రనిధిని సంప్రదించాలన్నారు.

రిమ్స్‌లో అరుదైన శస్త్రచికిత్స


శస్త్ర చికిత్స అనంతరం కణితిని చూపుతున్న వైద్య బృందం

కడప సెవెన్ రోడ్స్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కడప సర్వజన ఆసుపత్రి రిమ్స్‌లో రాయచోటికి చెందిన వ్యక్తికి అరుదైన శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు. రాయచోటికి చెందిన వ్యక్తి కడుపు ఉబ్బరం మరియు కడుపునొప్పితో బాధపడుతూ రిమ్స్‌కు వచ్చారు. సదరు వ్యక్తిని డాక్టర్లు పరీక్షించి కడుపులో పెద్ద కణితి ఉందని నిర్ధారించారు. శస్త్రచికిత్స విభాగాధిపతి డాక్టర్ వాణి ఆధ్వర్యంలో వైద్య బృందం రెండు గంటలపాటు శ్రమించి సుమారు ఆరు కేజీల కణితిని తొలగించినట్లు వైద్య బృందం తెలిపారు. ఇలాంటి అరుదైన శస్త్ర చికిత్స చేసినందుకు డాక్టర్ వాణి, వైద్య బృందం, మత్తు వైద్య బృందాన్ని ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ ఈ సందర్భంగా అభినందించారు.

జాతీయస్థాయిలో రిమ్స్ వైద్య విద్యార్థి ప్రతిభ


విద్యార్థిని హర్షిణిని అభినందిస్తున్న వైద్య బృందం

కడప సెవెన్ రోడ్స్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గత డిసెంబర్‌లో జాతీయస్థాయిలో ఆగ్రాలో జరిగిన శస్త్రచికిత్స అవగాహన సదస్సులో కడప రిమ్స్ జనరల్ సర్జరీ వైద్య విద్యార్థిని డాక్టర్ యు.హర్షిణి అద్భుత ప్రతిభ కనబరిచారు. జనరల్ సర్జరీ విభాగంలో మూడో సంవత్సరం చదువుతున్న పీజీ విద్యార్థిని మొదటి బహుమతి కైవసం చేసు కున్నారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థిని శస్త్రచికిత్స విభాగాధిపతి డాక్టర్ వాణి, ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ అభినందించారు.

ఏఎన్ఎంలకు పదోన్నతులు

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సచివాలయాల్లో గ్రేడ్-3 ఏఎన్ఎంలకు ఎంపీహెచ్‌డబ్ల్యు (ఎఫ్) పదోన్నతులు కల్పిస్తూ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ నాగరాజు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సెలింగ్‌లో ఉమ్మడి జిల్లాల పరిధిలో ఏఎన్ఎంలుగా పనిచేస్తున్న 141 మందికి మెరిట్ ప్రాతిపదికన ఎంపీహెచ్‌డబ్ల్యు(ఎఫ్)లుగా పదోన్నతులు పొందారు. ఈ కమిటీలో జడ్పీసీఈఓ ఓబులమ్మ, మున్సిపల్ కమిషనరు మనోజ్‌రెడ్డి, డీపీఓ, సూపరింటెండెంట్ రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థి ప్రతిభ



దువ్వూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపాడు గ్రామానికి చెందిన శ్రీకాంత్‌రెడ్డి రైతు బిడ్డ. ఈ విద్యార్థి చదువులో దిట్ట. జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 99.27 మార్కులు సాధించి తన ప్రతిభను చాటాడు. త్వరలో జరుగబోయే అడ్వాన్స్ పరీక్షల్లో మంచి ర్యాంకు సాధించి ఐఐటీలో సీటు సాధిస్తారనే విద్యార్థి తల్లిదండ్రులు ఆశాభావం వ్యక్తం చేశారు.

నాణ్యతే ప్రామాణికంగా దరఖాస్తులను పరిష్కరించండి

- కలెక్టర్ శ్రీధర్ చామకూరి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చామకూరి

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): నాణ్యతే ప్రామాణికంగా పీజీఆర్ఎస్ దరఖాస్తు లను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మదనపల్లె తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ డిసెంబరు 6 నుంచి జనవరి 8 వరకు మండలం లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో భాగంగా భూసమస్యలపై ప్రజల నుంచి అందిన ఫిర్యాదుల పరిష్కారం ప్రగతిపై తహసీల్దార్, ఆర్ఐ, మండల సర్వేయర్, వీఆర్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో వచ్చిన సమస్యలు ఏన్ని పరిష్కారం జరిగాయి.. ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి.. ఎందుకు పరిష్కారం అందించలేకపోయారో తహసీల్దార్‌లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో పీజీఆర్ఎస్‌లో 11వేల దరఖాస్తులు వచ్చాయని, ఇందులో ఇప్పటికి ఐదు వేలు దరఖాస్తులకు పరిష్కారం అందించారని తెలిపారు. మిగిలిన దరఖాస్తులు అత్యంత నాణ్యతతో వేగంగా కచ్చితత్వంతో పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు ఐవీఆర్ఎస్ ద్వారా నేరుగా దరఖాస్తుదారుడికి ఫోన్ చేసి వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది మీ దగ్గరకు వచ్చారా, మీ సమస్య పరిష్కారం అయిందా, క్షేత్ర స్థాయిలో విచారణ చేస్తున్నారా అని ప్రశ్నలు వేస్తున్నారు. దరఖాస్తుల పరిష్కారంలో జిల్లాలో భాగా వెనకబడిన మండలాల్లో మదనపల్లె కూడా ఒక్కటన్నారు. దరఖాస్తుల పరిష్కారంలో వెనకబడి ఉన్న వీఆర్వోలను వెంటనే మండలంలోని వివిధ ప్రాంతాలకు పంపాలని తహసీల్దార్‌కు సూచించారు. క్షేత్ర స్థాయిలో విచారణ చేసి నాణ్యతతో పరిష్కారం చేయడమే ధ్యేయం కావాలన్నారు. ఇంకను పెండింగ్‌లో ఉన్న వాటిని ఎస్ఎల్ఏ పరిధి లోగా పరిష్కరించాలన్నారు. వచ్చిన అర్జీల్లో మ్యూటేషన్, అసైన్మెంట్, ఆర్ఓఆర్, భూ సేకరణ, దారిసమస్యలు, అన్నదమ్ముల భాగపరిష్కారాలు, సివిల్ కేసులు తదితరాలపై సమీక్షించి చర్యలు తీసుకోవాలని సూచించారు. మండలంలో ప్రభుత్వ భూములు ఎక్కడైనా అక్రమణ జరిగినట్లు గుర్తిస్తే వెంటనే తొలగించి స్వాధీనం చేసుకోవాలన్నారు. సమావేశంలో మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్, తహసీల్దార్ ధనంజయులు, ఆర్ఐ శేషాద్రిరావు, మండల సర్వేయర్ రెడ్డి శేఖర్, వీఆర్వోలు, విఆర్ఏలు పాల్గొన్నారు.

కౌమారదశలో ప్రలోభాలకు లోనుకావద్దు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ ఈదురుబాషా

చెన్నూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కౌమార దశలో ఆకర్షణలు, ప్రలోభాలకు లోను కావద్దని కడప యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఇన్‌స్పెక్టర్ ఈదురు బాషా అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ బాలల పరిరక్షణ విభాగంతో కలిసి బుధవారం విద్యార్థులకు యాంటిహ్యూమన్ ట్రాఫికింగ్, బాలల చట్టాలపై అవగాహన నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ పిల్లలు తల్లిదండ్రుల ఆశయాలకనుగుణంగా ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా సత్ప్రవర్తతో మెలగాలన్నారు. మహిళా ఇన్‌స్పెక్టర్ శాంత మాట్లాడుతూ కౌమార దశలో పిల్లలు ప్రతి విషయానికీ ఆకర్షితులవుతారని జాగ్రత్తగా నడుచుకోవాలన్నారు. మంచి చెడుల గురించి తెలుసుకోవడం, సోషల్ మీడియా, సైబర్ కాల్స్, ఫ్రాడ్ కాల్స్ లాంటివాటిపై అప్రమత్తంగా ఉండాలని లేదంటే ట్రాప్‌కు గురయ్యే అవకాశం ఉందన్నారు. బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ మహేశ్, చెన్నూరు సీఐ పురుషోత్తంరాజు, ఎస్ఐ శ్రీనివాసులు, హెచ్‌ఎం సుబ్రమణ్యం, పద్మనాభయ్య, మహిళా పోలీసు కార్యదర్శి చంద్రకళ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'బాదుడులో వైసీపీ, టీడీపీ పోటీపడుతున్నాయ్'

వేంపల్లె, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ధరలు, చార్జీలు, పన్నులు పెంచి ప్రజలను బాదడంలో వైసీపీ, టీడీపీలు పోటీపడుతున్నాయని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి విమర్శించారు. వేంపల్లెలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం 8సార్లు విద్యుత్ చార్జీలను పెంచి రూ.25వేల కోట్లు ప్రజలపై భారం మోపిందన్నారు. రెండుసార్లు ఆర్టీసీ చార్జీలు పెంచి రూ.900కోట్లు, పెట్రోల్, డీజల్‌పై అదనపు వ్యాట్, రోడ్డు సెస్ విధించి రూ.80వేల కోట్ల అదనపు భారం మోపిందన్నారు. చెత్త పన్ను, ఇసుక ధర, మద్యం ధర, ఆస్తి పన్ను పెంచి రూ.2.40 లక్షల కోట్ల అదనపు భారం ప్రజలపై మోపిందన్నారు. కూటమి అధికారంలోకి వస్తే భారం తగ్గిస్తామని నమ్మించి ఓట్లు వేయంచుకుందని, అధికారంలోకి వచ్చాక రూ.15వేల కోట్ల విద్యుత్ సర్దుబాటు చార్జీలు, మద్యం ధరలు సీసాపై రూ.10 పెంచి, రిజిస్ట్రేషన్ చార్జీలు 20శాతం పెంచిందన్నారు. యూజర్ చార్జీలు, జీఎస్టీపై పన్ను వేయబోతోందని, బాదుడులో తగ్గేదేలే అన్నట్లు వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు.

బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకుందాం

● ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో యాంటీ డ్రగ్ అవేర్నెస్

● ఫ్యాక్షన్ జోన్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి

కడప క్రైం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): యువత మత్తుకు అలవాటు పడి భవిష్యత్తును విచ్ఛిన్నం చేసుకోవద్దని, ప్రతి ఒక్కరూ తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని ఫ్యాక్షన్ జోన్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి సూచించారు. ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు కడప నగరంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన యాంటీ డ్రగ్స్ అవేర్‌నెస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సమాజంలో యువత మత్తుకు అలవాటుపడి బంగారు బవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారన్నారు. చిన్న చిన్న పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు కూలీలు వీటికి అలవాటు పడి కుటుంబాలు కూడా ఛిన్నాభిన్నం అయ్యే పరిస్థితులు దాపురిస్తున్నాయన్నారు. కళాశాల సమీప ప్రాంతాల్లో కానీ, చుట్టుపక్కల కానీ ఎవరైనా గంజాయి విక్రయిస్తున్నట్లు తెలిస్తే సమాచారం పోలీసులకు అందించాలని వివరాలు గోప్యంగా ఉంచుతారన్నారు. అధ్యాపకులు, ఇంజనీరింగ్ విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'ఎంకామ్ లేటరల్ ఎంట్రీకి అనుమతి ఇవ్వాలి'

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఆర్ట్స్ కళాశాలలో ఎంకామ్ లేటరల్ ఎంట్రీ అవకాశం కల్పించాలని ఏఐఎస్ఎఫ్ ప్రతినిధుల బృందం డిమాండ్ చేశారు. బుధవారం కడప నగర ఆర్ట్స్ కళాశాల ప్రధాన ద్వారం ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు జి.వలరాజు మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా మూడేళ్ల డిగ్రీని నాలుగేళ్లు చేసి అదే కళాశాలలో ఎంఏ ఆనర్స్ ఐదో సంవత్సరానికి చదవడానికి అనుమతి లేదంటూ యూనివర్సిటీ అధికారులు చెప్పడం విచిత్రంగా ఉందన్నారు. అధ్యాపకులు ఉండి తరగతి గది ఉండి యూనివర్సిటీ అధికారులు అనుమతి ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఎంకామ్ లేటరల్ ఎంట్రీ ఆర్ట్స్ కళాశాలలో విద్యార్థులకు అనుమతి ఇవ్వకపోతే పెద్దఎత్తున ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శివశంకర్, ఎల్.చంద్రనాగార్జున, సాయి, మధు, సాయిరాం, హరిప్రసాద్, కావేరి, స్వర్ణలత, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసిన ఆర్టీసీ ఆర్ఎం



రక్తదానం చేస్తున్న గోపాల్‌రెడ్డి

కడప మారుతీనగర్, ఫిబ్రవరి 12, (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా రిమ్స్ హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో కడప రీజనల్ మేనేజర్ పొలిమేర గోపాల్‌రెడ్డి రక్తదానం చేశారు. బుధవారం డాక్టర్ వైఎస్ఆర్ ఆర్టీసీ ఏరియా హాస్పిటల్‌లో ఆర్టీసీ ఉద్యోగుల సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఆపదలో వున్న వారి ప్రాణాలను ఆదుకునేలా రక్తదానం దోహదపడుతుందన్నారు. ఆర్టీసీ ఏరియా హాస్పిటల్ ప్రధాన మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి పర్యవేక్షణలో జిల్లాలోని వివిధ డిపోల నుంచి 54 మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. ఆర్టీసీ అధికారులు భాస్కర్, ఏటీఎం హరి, రిమ్స్ బ్లడ్‌బ్యాంక్ డాక్టర్ రాజేంద్ర, విజిలెన్స్ సెక్యూరిటీ ఆఫీసర్ రెహమాన్, ఆర్టీసీ ఏరియా హాస్పిటల్ సిబ్బంది, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ ఏర్పాటుకు సహకరించండి

లింగాల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వాటర్ గ్రిడ్ పథకంలో భాగంగా చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి నియోజకవర్గం ప్రజలకు తాగునీటి సరఫరా కోసం ఏర్పాటు చేస్తున్న పైప్‌లైన్ నిర్మాణానికి సహకరించాలని ఆర్డీఓ చిన్నయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ విజయభాస్కర్ కోరారు. పార్నపల్లె, వెలిదండ్ల, కర్ణపాపాయపల్లె గ్రామాల్లో బుధవారం వారు పర్యటించి ప్రజలతో మాట్లాడారు. సమస్యలుంటే ముందే తెలియజేయాలని వాటిని పరిష్కరిస్తామని పైప్‌లైన్ ఏర్పాటును అడ్డుకోకూడదని తెలిపారు. తహసీల్దార్ ఈశ్వరయ్య అధికారులు పాల్గొన్నారు.

హమ్మయ్యా... ఫర్నీచర్ వచ్చింది

అయినా జాప్యమే... ● ప్రారంభానికి నోచుకోని బస్టాండ్ ● ప్రయాణికులకు తప్పని అవస్థలు





పూర్తైన ఆర్టీసీ బస్టాండ్ - వేంపల్లెకు వచ్చిన ఫర్నీచర్‌ను పరిశీలిస్తున్న ఆర్టీసీ డీఎం రామకృష్ణ

వేంపల్లె, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): హమ్మయ్యా... ఎట్టకేలకు ఫర్నీచర్ వచ్చింది. అయినా బస్టాండ్ ప్రారంభానికి నోచుకోలేదు. నిత్యం వందలాది ప్రయాణీకులకు ఇబ్బందులు తప్పడంలేదు. వివరాల్లోకెళితే...

పట్టణం గుండా పులివెందుల, రాయచోటి, ప్రొద్దుటూరు, కడప, బెంగళూరు, కదిరి, అనంతపురం తదితర ప్రాంతాలకు నిత్యం ప్రయాణీకులు వెళుతుంటారు. ప్రయాణీకుల ఇక్కట్లపై స్థానిక ప్రజాప్రతినిధుల అభ్యర్థి మేరకు వైసీపీ ప్రభుత్వంలో వేంపల్లెకు బస్టాండ్ మంజూరైంది. పనులు మొదలెట్టి దాదాపు పూర్తికావచ్చే సమయంలో ఎన్నికలు సమీపించడంతో పనులు నిలిపేశారు. అనంతరం కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టింది. దీంతో ఎమ్మెల్సీ రామ్‌గోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవికి స్థానిక ప్రజలు బస్టాండ్ సమస్యను తెలియజేశారు. స్పందించిన వారు మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డితో మాట్లాడి పెండింగ్‌లో పనులు పూర్తిచేయించారు. పనులన్నీ పూర్తయి, అన్నీ సమకూరి సుమారు మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు. అడిగితే ఫర్నీచర్ రాలేదంటూ కాలయాపన చేశారు. కాగా ఎట్టకేలకు ఫర్నీచర్ వేంపల్లెకు చేరింది. దాన్ని బస్టాండ్‌లోని గదుల్లో ఉంచారు. ఫర్నీచర్ వచ్చినా బస్టాండ్‌ను ప్రారంభించేందుకు ఇంత ఆలస్యమెందుకు అర్థం కావడం లేదని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. బస్టాండ్‌ను ప్రారంభిస్తే ప్రయాణికులకు రోడ్డుమీద ఎండలో నిలబడి బస్సులు ఎక్కాల్సిన దుస్థితి తప్పుతుందంటున్నారు. ప్రధానంగా మరుగుదొడ్లు లేక తీవ్ర అసౌకర్యం కలుగుతున్న సమస్య తీరుతుంది. దీనిపై ఆర్టీసీ అధికారులు, స్థానిక నేతలు వెంటనే దృష్టిసారించి వీలైనంత త్వరగా బస్టాండ్‌ను ప్రారంభించాలని పలువురు ప్రయాణీకులు కోరుతున్నారు.

ఘనంగా మాఘ పౌర్ణమి వేడుకలు

వేడుకగా విజయదుర్గాదేవి ఆలయ బ్రహ్మోత్సవాలు





అమ్మవారి కలశాలను తీసుకొస్తున్న ఆలయ నిర్వాహకులు దుర్గా ప్రసాద్, మహిళలు - వ్యాఘ్ర వాహనంపై అమ్మవారు చిత్రంలో ఆలయ వ్యవస్థాపకులు దుర్గా మల్లికార్జున రావు, తదితరులు

కడప కల్చరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): నగర బిల్టప్‌సమీప విజయదుర్గాదేవి ఆలయ 23వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు బుధవారం మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని తెల్లవారుజామున అమ్మవారికి నవకలశ స్నపనం (విశేష పంచామృతాభిషేకము) నిర్వహించారు. అనంతరం అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. యాగశాలలో ఉదయం 10 గంటలకు చండీ హోమము, ఆలయ మండపంలో శ్రీ చక్రార్చనలు గావించారు. సాయంత్రం 6 గంటలకు ఆలయ మండపంలో విజయదుర్గ-మల్లికార్జున స్వామి వార్లకు 108 మంది ముత్తైదువులచే 108 దీపాలను వెలిగించి దీపాలంకరణ సేవ నిర్వహించారు. రాత్రి 8 గంటలకు విజయదుర్గా- మల్లికార్జునులు వ్యాఘ్ర (పులి) వాహనంపై ఆలయ ప్రదక్షణ గావించారు. అమ్మవారి రథం ఊరేగింపులో విజయదుర్గా కాలనీ వాసుల కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భక్తులందరూ అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొని ఆ తల్లి దివ్య ఆశీస్సులు పొందగలరని ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జున రావు, ఆలయ నిర్వాహకులు సుధా దుర్గాప్రసాద్ తెలిపారు.

కడపలో కొత్త సంస్కృతి ప్రారంభం

టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి



కడప ఎర్రముక్కపల్లె, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో కొత్త సంస్కృతి ప్రారంభమైందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. రాష్ట్రంలో స్వచ్ఛమైన పాలన కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. బుధవారం కడపలోని ద్వారకనగర్ తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గడిచిన ఎనిమిది నెలల పాలనలో స్వచ్ఛ కడపగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నామన్నారు. వైసీపీ పాలనలో చెడిపోయిన కడపను బాగుచేయడం కోసం ప్రజల్లోకి వెళ్లామన్నారు. కార్పొరేషన్ పూర్తి అవినీతిమయంలో కూరుకుపోయిందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో పడిన అవినీతి మరక తుడిచేందుకు మాత్రమే ప్రయత్నం చేస్తున్నాం తప్ప ఇది కక్షసాధింపు కాదన్నారు. కొత్త సంస్కృతికి తెరలేపాం, అవినీతి భండారం బయటపడుతోందని ఇద్దరు నేతలు భయపడుతున్నారన్నారు. అవినీతిని తన్ని తరిమి అభివృద్ధికి ప్రజలు సహకరించాలి.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

నియోజకవర్గంలోని 20 మంది లబ్ధిదారులకు రూ.19 లక్షల 94 వేల 591 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు రెడ్డెప్పగారి శ్రీనివాసరెడ్డి పంపిణీ చేశారు. ప్రజలకు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి ద్వారా బాధిత కుటుంబాలకు, నిరుపేదలకు చెక్కులను అందించారు.

రెండో ఏఎన్‌ఎంలకు ప్రమోషన్లు కల్పించాలి

కడప కలెక్టరేట్ ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి) ఉమ్మడి కడప జిల్లా సచివాలయాల్లో పని చేస్తున్న గ్రేడ్-3 ఏఎన్‌ఎంలకు ఎంపీహెచ్(ఎఫ్)లుగా పదోన్నతులు కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్, ఏఎన్‌ఎం యూనియన్ నాయకురాలు కమాల్ బీ డిమాండ్ చేశారు. బుధవారం డీఎంఅండ్ హెచ్ఓ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సచివాలయ రెండో ఏఎన్‌ఎంలతో కలిసి నిరసనలో వారు మాట్లాడుతూ 141 మందికి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు జరుపుతున్న పదోన్నతుల కౌన్సెలింగ్‌ను వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. మెరిట్ ప్రాతిపదికన కాకుండా సీనియార్టీ ప్రకారం కౌన్సెలింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీరాజ్, ఆరోగ్యశాఖల ఆదేశాలు పాటించేలా సచివాలయ ఎన్‌ఎంలపై ఒక సమయంలో పనిభారం మోపడం తగదన్నారు. అలవెన్సులు అడిగితే మాకు సంబంధం లేదని చెప్పడం బాధాకరమన్నారు. గతంలో కంటి వెలుగు సర్వే చేయించి నెల పాటు సీనియార్టీని కోల్పోయామన్నారు. అనంతరం డీఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ నాగరాజుకు వినతి పత్రం అందజేశారు.

పూలధారణకు క్రేన్ సౌకర్యం కల్పించండి

నగరపాలక కమిషనర్‌ను కలిసిన సమితి నేతలు



కమిషనర్ మనోజ్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న దాసరి శివప్రసాద్, తోటకృష్ణ

కడప మారుతీనగర్, ఫిబ్రవరి 12, (ఆంధ్ర జ్యోతి): నగరంలో ఎత్తైన విగ్రహాలకు పూలధారణ చేసేందుకు క్రేన్ సౌకర్యం కల్పించాలని శ్రీకృష్ణదేవరాయ బలిజ అభ్యుదయ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు దాసరి శివప్రసాద్, నేత తోటకృష్ణ నగర కమిషనర్ మనోజ్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈనెల 16న శ్రీ కృష్ణదేవరాయలు జయంతి పురస్కరించుకుని శ్రీకృష్ణదేవరాయల సర్కిల్ వద్ద గల ఆయన విగ్రహానికి పూలధారణ చేసేందుకు క్రేన్ సౌకర్యం కల్పిస్తూ, కూడలి పూల సుందరీకరణకు అనుమతించాలని కోరారు. నగర సుందరీకరణలో భాగంగా వైసీపీ ప్రభుత్వం పాత విగ్రహాన్ని తొలగించి కొత్త విగ్రహాన్ని ఏర్పాటు చేసిందన్నారు. అయితే గతంలో ఉన్న నిచ్చెనను తిరిగి ఏర్పాటు చేయలేదన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ షఫీ తదితరులు పాల్గొన్నారు.



ఇటీవల అనంతపురంలో జరిగిన స్టేట్ మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్2025లో, వంద మీటర్ల రన్‌లో 3వ స్థానం, 200 మీటర్ల రన్‌లో 2వ స్థానం 400 మీటర్ల రన్‌లో 2వ స్థానం సాధించిన నాయుడు రాజశేఖర్‌ను జిల్లా జనసేన నేత తుంగ రమణయ్య శాలువాతో సత్కరించారు. బెంగళూరులో జరిగే ఆల్ ఇండియా మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో జిల్లా పేరును నిలపాలని కోరారు.

సింహవాహనంపై శ్రీరంగనాథుడు



పులివెందుల రూరల్, ఫిబ్రవరి 12: రంగనాథస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీదేవి, భూదేవి సమేతంగా స్వామివారు సింహవాహనంపై దర్శనమిచ్చారు. ఆలయ ఛైర్మన్ చింతకుంట సుధీకర్ రెడ్డి, ఈఓ వెంకటరమణ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణరాజేష్ శర్మ, శశిధర్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ఉభయదారులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించి మొక్కుకున్నారు. స్వామివారు పట్టణంలో సింహవాహనంపై ఊరేగారు.

ఘనంగా సత్యనారాయణ వ్రతం

వేంపల్లె, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో రమాసహిత సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. మాఘ పూర్ణిమ పురస్కరించుకుని బుధవారం ఆలయ అర్చకులు అచ్యుత్ ఆధ్వర్యంలో వ్రత పూజలు నిర్వహించారు. విశిష్టమైన రోజు వ్రతం చేయడం ఆ వ్రతంలో పాల్గొనడం అందరికీ మేలు జరుగుతుందని తెలిపారు.

కల్తీ ఆహార పదార్థాలు విక్రయిస్తే చర్యలు

వేంపల్లె, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కల్తీ ఆహార పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి హరిత హెచ్చరించారు. వేంపల్లెలోని హోటల్లు, కూల్‌డ్రింక్, జ్యూస్ షాపులను బుధవారం తనిఖీ చేశారు. నిబంధనలకు లోబడి దుకాణాలు నిర్వహించాలన్నారు. కల్తీ జరిగినట్లు తెలిస్తే ఫిర్యాదు చేయాలన్నారు. కల్తీ జరిగిన చోట కేసులు నమోదు చేస్తామని, దుకాణాల లైసెన్సులు రద్దు చేస్తామన్నారు. సిబ్బంది వెంట ఉన్నారు.

ర్యాష్ డ్రైవింగ్‌తో ప్రమాదం

చెన్నూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు 18 ఏళ్లలోపు డ్రైవింగ్ లైసెన్సు పొందకుండా ర్యాష్ డ్రైవింగ్ చేయడం, ద్విచక్ర వాహనంపై ఒకరిని మించి ఎక్కించుకుని వాహనం నడపడం వంటి వాటికి దూరంగా ఉండాలని లేదంటే వారి భవిష్యత్తుకు ఇబ్బంది ఉంటుందని సీఐ పురుషోత్తంరాజు అన్నారు. స్థానిక కొత్తరోడ్డులో బుధవారం రాత్రి పలువురు విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ర్యాష్ డ్రైవింగ్‌పై వివరించారు. చిన్నారులకు చట్టాల గురించి ఈవ్‌టీజింగ్ గురించి తెలిపారు. చదువుపై ఎక్కువ శ్రద్ధ పెట్టాలని, తద్వారా భవిష్యత్తులో మంచి పౌరులుగా మారతారన్నారు.

ఖైదీలకు రక్త పరీక్షలు

కడప క్రైం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కడప కేంద్ర కారాగారంలో గురువారం ఖైదీలకు హెచ్ఐవీ పరీక్షలు, ఇతర రక్తపరీక్షలు నిర్వహించారు. జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఈ పరీక్షలు నిర్వహించారు. జైలు పర్యవేక్షణ అధికారి రాజేశ్వర్‌రావు ఉప పర్యవేక్షణాధికారి కమలాకర్, రమేశ్ ఆధ్వర్యంలో ఖైదీలకు పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆరోగ్య విధి విధానాలపై అవగాహన కల్పించడం, వారికి రాత పరీక్ష నిర్వహించారు. విజేతలకు బహుమతుల అందించారు.

ట్రాఫిక్ సమస్యపై సహకరించాలి

కడప క్రైం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): నగరంలో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కడప ట్రాఫిక్ సీఐ జావేద్ పిలుపునిచ్చారు. తన కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ రోడ్లపై తోపుడుబండ్లు అడ్డంగా నిలిపి వ్యాపారాలు చేస్తున్నారని దీంతో ట్రాఫిక్ సమస్య నెలకుంటోందన్నారు. వైవీ స్ట్రీట్, బీకేఎం స్ట్రీట్ తదితర ప్రాంతాల్లో దుకాణదారులే రోడ్లను ఆక్రమిస్తున్నారని దీంతో తోపుడుబడ్లు దుకాణాల ముందు అనుమతులు ఇవ్వడం, వారి వద్ద బాడుగ వసూలు చేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర ఉత్పత్తులు

వేంపల్లె, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యకర ఉత్పత్తులు లభిస్తున్నాయని, వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, వేంపల్లె ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ శేఖర్, ఏఓ రాజేంద్రప్రసాద్, మార్కెటింగ్ మేనేజర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో ఎంటీ ప్రతాప్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ప్రదర్శించారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు తదితరాలు అమ్మకానికి ప్రదర్శించారు. ప్రతి ఒక్కరూ ఇలాంటి ఉత్పత్తులను తీసుకెళ్లాలన్నారు.

'అర్చకుడిపై దాడి హేయమైన చర్య'



నిరసన తెలుపుతున్న బీజేపీ, ఏపీ పీబీఎస్, బీజేవైఎం నేతలు

కడప కల్చరల్, ఫిబ్రవరి 12, (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం చిలుకూరి బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై దాడి హేయమైన చర్యఅని ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య (ఏపీ పీబీఎస్), బీజేపీ, బీజేవైఎం నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. అర్చకుడిపై జరిగిన దాడిని నిరసిస్తూ బ్రాహ్మణ సమాఖ్య జిల్లా గౌరవాధ్యక్షుడు బ్రాహ్మణపల్లి చంద్రమౌళీశ్వరశర్మ, అధ్యక్షుడు వారణాశి శ్రీధర్‌శర్మ ఆధ్వర్యంలో రాజరాజేశ్వరీదేవి ఆలయం నుంచి ర్యాలీగా అన్నమయ్య విగ్రహం వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు జె. వెంకటసుబ్బారెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్, రాష్ట్ర నేతలు బాలకృష్ణ యాదవ్, పవన్‌కుమార్ మాట్లాడుతూ కొన్నేళ్లగా తెలుగు రాష్ట్రాల్లో దేవాలయాలు, అర్చకులపై దాడులకు తెగబడడం పరిపాటిగా మారిందన్నారు. సర్వేజన సుఖీ నోభవంతు అని దీవించే బ్రాహ్మణులపైనే దాడికి పాల్పడుతున్న తీరు బాధాకరమన్నారు. దాడి చర్యలు ఇటు పాలకులకు, అటు సమాజానికి మంచిది కాదన్నారు. ఎవరికీ హాని తలపెట్టని బ్రాహ్మణులు తమ రక్షణ కోసం ఇదం బ్రహ్మం ఇదం క్షాత్రం అని పరశురామ అవతారం ఎత్తవలసి వస్తుందని హెచ్చరించారు.

గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన ఆరోగ్య సంరక్షణ

కడప(వినాయకనగర్), ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): నిహార్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగళూరు రామయ్య యూనివర్సిటీ సౌజన్యంతో గ్రామీణ యువతకు నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్‌లో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ సయ్యద్ మహమ్మద్‌బాషా మాట్లాడుతూ ఆరోగ్యమైన అవగాహన లేకపోవడం, వైద్య వసతుల కొరత, ఆర్థిక పరిస్థితులతో చాలామంది సరైన సమయంలో వైద్యం పొందలేకపోతున్నారన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం, గ్రామీణ ఆరోగ్య సంరక్షణను మరింత మెరుగు పరచగలమన్నారు.

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి సారించండి

కడప మారుతీనగర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): అమరావతి, పోలవరం సహా నిత్యం కరువు కాటకాలతో అల్లాడుతున్న రాయలసీమ ప్రాంత అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఏపీ రాష్ట్ర వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక నేతలు నారాయణ, ఎస్ఏ సత్తార్ కోరారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లో అమరావతి సహా పోలవరంపై ప్రత్యేకదృష్టి సారించడం అభినందనీయమన్నారు. అదే తరహాలో ప్రకాశం, నెల్లూరు జిల్లాల వెనుకబడిన ప్రాంతాల సాగు, తాగునీటి ప్రాజెక్టులైన హంద్రీనీవా, గాలేరు నగరి, వెలిగొండ, తెలుగుగంగ, శ్రీశైలం కుడి కాల్వ, సోమశిల హైలెవెల్ ఎత్తిపోతల పథకాలను ప్రాతికదిగా పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్ల అయినా ఏ ఒక్క విభజన హామీ నెరవేరలేదన్నారు. సీమలోనే విద్యుత్ నియంత్రణ కమిషన్ కార్యాలయం, జాతీయ లా యూనివర్శిటీ, కొప్పర్తి పారిశ్రామిక శిక్షణ కేంద్రం, ఏపీజీబీ కార్యాలయాలను అమరావతికి తరలించడం ఆపాలన్నారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ

ముద్దనూరు ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి):స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను ప్రొద్దుటూరు డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి మీనాక్షి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.అందులో భాగంగా ఆమె పాఠశాల రికార్డులు, రిజిష్టర్లు పరిశీలించారు.పదోతరగతి విద్యార్థినులకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణి కిడ్నీకేర్ ఆస్పత్రిలో నేటి నుంచి ఉచిత ఓపీ సేవలు

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయికుటీర్‌రోడ్డులో ఉన్న కల్యాణి కిడ్నీకేర్ ఆస్పత్రిలో ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు ఉచిత ఓపీ సేవలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ నరేంద్రారెడ్డి తెలిపారు. మూడు రోజులపాటు ఉచిత ఓపీతోపాటు రక్త పరీక్షలకు 50 శాతం రాయితీ, అల్ట్రాసౌండ్ స్కానింగ్‌కు రాయితీ ఇస్తామని తెలిపారు. కిడ్నీ, రాళ్ల సమస్యలు, ఇతర న్యూరాలజీ సమస్యలతో బాధపడుతున్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శివదీక్షాదారుల భిక్షాటన



ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): శివదీక్షా బృందం ఆధ్వర్యంలో బుధవారం భిక్షాటన నిర్వహించారు. మూడు రోజులపాటు సాగే భిక్షాటనను బుధవారం రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయం, వసంతపేట, గాంధీరోడ్డు, టీబీరోడ్డు మీదుగా శివాలయం వరకు నిర్వహించారు. 50 మంది శివభక్తులు భిక్షాటనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివభక్తులు మాట్లాడుతూ లోకకల్యాణం కోసం పరమశివుడు భిక్షాటన చేశారని 23 సంవత్సరాలుగా తాము కూడా భిక్షాటన నిర్వహిస్తున్నామని తెలిపారు.వచ్చిన డబ్బులను అన్నదానం, హోమం నిర్వహణకోసం వినియోగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శివభక్తులు పాల్గొన్నారు.

జీవోనెంబరు 36ను అమలు చేయాలి



నిరసన తెలుపుతున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, ఇంజనీరింగ్ విభాగంలోని కార్మికులకు జీవో నెంబరు 36 ప్రకారం వేతనాలు ఇవ్వాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, పట్టణ కార్యదర్శి సాల్మన్ డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ వర్కర్స్ యూనియర్ ఆధ్వర్యంలోమున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. అనంతరం కమిషనర్ మల్లికార్జునకు వినతి పత్రం అందజేశారుకార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కోశాధికారి రాఘవేంద్ర, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



బద్వేలు రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని విజయరావాపురం గ్రామానికి చెందిన రాగె వెంకటనరసయ్య కుటుంబానికి కువైట్ యాదవ సంఘం రూ.50వేలు ఆర్థిక సాయం బుధవారం ఆయన భార్య లక్ష్మీదేవికి అందించారు. వెంకట నరసయ్య ఐదు నెలల క్రితం గుండెపోటుతో మృతి చెందగా భార్య లక్ష్మీదేవి, ఇద్దరు కుమారులు కుటుంబ పోషణ భారమై తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు కువైట్ యాదవ సంఘాన్ని ఆశ్రయించడంతో స్పందించినఆ సంఘం అధ్యక్షుడు చల్లాబాబుయాదవ్ ఆ కుటుంబానికి రూ.50వేలు ఆర్థికసాయం అందించారు. అఖిల భారత యాదవ సంఘం అధ్యక్షుడు బుర్రి రాజాయాదవ్ లక్ష్మీదేవికి రూ.50వేలు నగదును అందించారు. ఈ కార్యక్రమంలో విజయరామాపురం గ్రామస్థులు పడమేకల పెంచలయ్య, రామనబోయిన పెంచలయ్య, బత్తల శ్రీనివాసులు పాల్గొన్నారు.

వైభవంగా సత్యనారాయణస్వామి వ్రతం



బద్వేలుటౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నెల్లూరురోడ్డు, గౌరీశంకర్ నగర్‌లో వెలసిఉన్న రమాదేవి సహిత సత్యనారాయణస్వామి ఆలయంలో స్వామివారి వ్రతాన్ని బుధవారం మాఘపౌర్ణమి సందర్భంగా వైభవంగా నిర్వహించారు.అనంతరం 101 మంది దంపతులతో వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తాదులకు ఆలయకమిటీవారు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు.

జొన్నలకు గిట్టుబాటు ధర కల్పించాలి

చాపాడు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం జొన్నలకు సరైన గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు. 2024 రబీ సీజన్‌లో రైతులు సుమారు 3 వేల ఎకరాల్లో జొన్నపైరు సాగు చేశారు. ప్రస్తుతం మిషన్లతో కోతలు కోస్తున్నారు. ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చినట్లు రైతులు తెలిపారు. ప్రొద్దుటూరుకు చెందిన వ్యాపారులు క్వింటాలు రూ.2,200లకు కొనుగోలు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. గత ఏడాది క్వింటాల్‌ను ప్రభుత్వం రూ3,200లకు కొనుగోలు చేసింది. ఒక క్వింటాలుపై వెయ్యి రూపాయలు ధర తగ్గడంతో రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ ధర ఏమాత్రం చాలదని చెప్పారు. నక్కలదిన్నె, అనంతపురం, ఓబాయపల్లె, రాజువారిపేట బసిరెడ్డిపల్లె తదితర గ్రామాల వద్ద జొన్నపైరు సాగు చేశారు. దిగుబడి తగ్గడం, ధర తగ్గడంతో రైతులు నిట్టూర్పునకు గురవుతున్నారు. సేద్యం, కూలి రేట్లు, రసాయనిక ఎరువులు, పురుగు మందులు, విత్తనాలకు ఎకరాకు సుమారు రూ.16 వేలు ఖర్చు అయినట్లు తెలిపారు. చాలా మంది రైతులు ఆశించినస్థాయిలో లేనందున జొన్నలను విక్రయించేందుకు మనస్సు ఒప్పుకోక ఇళ్లల్లోనే నిలువ చేసుకుంటున్నారు.



సంచుల్లో జొన్నలు నింపుతున్న కూలీలు, రాశిగా పోసిన జొన్నలు

1104 యూనియన్ ప్లాటినం జూబ్లీ వేడుకలు

ప్రొద్దుటూరు ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ 1104 ఏర్పడి 75 సంవత్సరాలు పూర్తి చేసుకుని కార్మికుల హక్కుల కోసం పోరాడుతోందని యూనియన్ జిల్లా ప్రాంతీయ అధ్యక్షుడు యూఎస్ కెనడీ బర్నబాస్ వెల్లడించారు.బుధవారం 1104 యూనియన్ ప్లాటినం జూబ్లి వేడుకలను స్థానిక విద్యుత్ కార్యాలయం ఆవరణలో నిర్వహించారు, ఈ సందర్భంగా ఎర్ర జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి వై కృష్ణ మూర్తి, డివిజన్ సలహాదారు ఎస్ఎ గఫూర్, డివిజన్ అధ్యక్షుడు మాదవ్, కార్యదర్శి ఎస్ షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో రోగులకు స్కానింగ్‌లు చేయాలి



సూపరింటెండెంట్‌ను ప్రశ్నిస్తున్న ఇర్ఫాన్ బాషా

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు అవసరమైన ఎంఆర్ఐ సిటీ స్కాన్లు చేయకుండా ఆంక్షలు పెట్టడం సరికాదని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్ చార్జ్ కౌన్సిలర్ ఇర్ఫాన్ బాషా ప్రశ్నించారు. బుధవారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన ఇర్ఫాన్ బాషా రోగులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొద్దిరోజులుగా ఆసుపత్రిలో ఎంఆర్ఐ స్కానింగ్ సిటీ స్కానింగ్ గానీ చేయడం లేదని రోగులు వాపోయారు. దీంతో ఆయన సూపరింటెండెంట్ ఆనంద్‌బాబును ఎందుకు స్కానింగ్‌లు చేయడం లేదని ప్రశ్నించారు. ఇందుకు ఆనంద్ బాబు మాట్లాడుతూ వైద్యఆరోగ్య శాఖ జాయింట్ కమిషనర్ ఆదేశాలమేరకు కేవలం ఆర్థో డాక్టర్ మాత్రమే సిటీ స్కానింగ్, ఎంఆర్ఐ లకు రెఫర్ చేయాలని ఆదేశించారన్నారు. ఆసుపత్రిలో స్పెషలిస్టు వైద్యులు లేరని బయట ప్రైవేటు ఆసుపత్రిలో చూపించుకున్న పేదలకు అవసరమైతే స్కానింగ్ ఎంఆర్ఐ ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా చేయాలని డిమాండ్ చేశారు. సూపరింటెండెంట్‌కు స్కానింగ్ ఎంఆర్ఐ రెఫర్ చేసే అధికారం వుండాలన్నారు.

స్వర్ణపతక విజేతకు అభినందనలు

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : తైక్వాండోలో స్వర్ణపతకం సాధించిన విజేతలకు ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది అభినందనలు తెలిపారు. గత నెల 25 నుంచి 30 వరకు హైదరాబాదులో జరిగిన 45వ జాతీయ తైక్వాండో పోటీల్లో పోరుమామిళ్ల ప్రభుత్వ డిగ్రీకళాశాల విద్యార్థిని బొల్లు సాయిప్రీతి రజత పతకం సాధించింది. అలాగే గత నెల 31 నుంచి ఈ నెల 2 వరకు కాకినాడలో జరిగిన ఎన్టీఆర్ రాష్ట్రస్థాయి పోటీల్లోస్వర్ణ పతకం సాధించినందుకు బుధవారం కళాశాల అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

మాలమహానాడు నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మాలమహానాడు జి.చెన్నయ్య వర్గం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. ఎన్జీవో హోంలో జరిగిన సమావేశంలో ప్రొద్దుటూరు తాలూకా అధ్యక్షుడిగా మధుబాబు, పట్టణాధ్యక్షుడు పవన్, మహిళా అధ్యక్షురాలు శాంతమ్మ, గౌరవాధ్యక్షుడు సుధాకర్, యూత్ అధ్యక్షుడు స్వరూప్, ఉపాధ్యక్షుడు సన్నా, జిల్లా ప్రధాన కార్యదర్శి మునీర్, జిల్లా జాయింట్ సెక్రటరీ చంద్రశేఖర్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీపతి భాస్కర్, రాబర్ట్ పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

జమ్మలమడుగు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి తెలిపారు. ఈనెల 10వ తదీన సోమవారం యోగివేమన యూనివర్సిటీ విడుదల చేసిన పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచారన్నారు. మొదటి, మూడో, 5వ సెమిస్టర్ విద్యార్థులు యూనివర్సిటీస్థాయిలో మంచి మార్కులు పొందారన్నారు. మొదటి సెమిస్టర్ ఫలితాల్లో పి.లక్ష్మీదేవి 10జీపీఏ, రాజకుళాయమ్మ 9.50 జీపీఏ ఫలితాలు సాధించారు. మొదటి, రెండో స్థానంలో యూనివర్సిటీస్థాయిలో నిలిచినట్లు వారు తెలిపారు. మూడో సెమిస్టర్ ఫలితాల్లో ఎ.మాధవి 10జీపీఏ, ఎన్.ప్రమీళ 9.80 జీపీఏ, కె.హారిక 9.80, జి.చందు 9.80, ఎస్.చాందిని 9.60, కె.సౌజన్య 9.60, గౌరీమోహన్ 9.60 జీపీఏ సాధించారు. 5వ సెమిస్టర్ ఫలితాల్లో పి.ప్రియాంక 8.78 జీపీఏ, డి.మనీషా 8.65, వెంకటమాధవ 8.33, ఎస్. అబ్దుల్‌కలాం 8.20, వెంకటపార్థసారధి 8.22 ఫలితాలను సాధించి వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

మోటారు బైకును ఢీకొన్న కారు: ఒకరికి గాయాలు

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో మోటారు బైకులో వెళుతున్న వ్యక్తిని కారు ఢీకొనడంతో జనార్ధన్‌రెడ్డి అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం సిద్దవరానికి చెందిన జనార్ధనరెడ్డి పోరుమామిళ్లకు వస్తుండగా పోరుమామిళ్ల నుంచి బద్వేలు వెళుతున్న కారు ఢీకొనడంతో వృద్ధుని కాలికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వ్యక్తిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.

'ఉపవిద్యాశాఖాధికారిపై చర్యలు తీసుకోవాలి'

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉపవిద్యాశాఖాధికారి యు.మీనాక్షిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బుధవారం రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ నాయకులు డిప్యూటీ డీఈవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆర్ఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు జగన్ మాట్లాడుతూ ఉపవిద్యాశాఖాధికారి సమయపాలన పాటించడంలేదని, కార్యాలయంలో ఎప్పుడు ఉంటారో తెలియదన్నారు. అధికారుల పర్యవేక్షణ లేక డివిజన్‌లోని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నాయని, ఆ పాఠశాలలను తనిఖీ చేయకపోవడం దారుణమన్నారు. ఆర్‌జేడీ ఉపవిద్యాశాఖాధికారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

గర్భస్థ శిశు లింగనిర్ధారణ చట్టంపై అవగాహన కార్యక్రమం

కలసపాడు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : కలసపాడు మండలంలోని లింగంపల్లె గ్రామ పంచాయతీలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో తల్లులు, గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజరు చంద్రకళ మాట్లాడుతూ ఈ చట్టం 1994లో ఏర్పాటయిందని అన్నారు. భ్రూణ హత్యలు నివారించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి కంభంపాటి సాయి తేజ, అంగన్వాడీ టీచర్ జోష్పిన్, ఆశా, మహిళా పోలీసు, మహిళలు పాల్గొన్నారు.

కోర్టు వలంటీర్లు అంగవైకల్య సర్వేని జయప్రదం చేయండి

బద్వేలు రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో సంవత్సరంలోపు పిల్లల అంగవైకల్యం, చెవిటి, మూగ ఇతరత్రా సమస్యలతో బాధపడే వారి కోసం చేపడుతున్న ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని కోర్టు ప్యారాలీగల్ వలంటీర్లు జయప్రదం చేయాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ సీనియర్ సివిల్ జడ్జి వైజే పద్మశ్రీ కోరారు. బుధవారం స్థానిక కోర్టులో పారా వలంటీర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 10 నుండి ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామని, అంగవైకల్యం కలిగిన పిల్లలను గుర్తించి హెల్త్ సెంటరు కడపలో వారికి ఉచిత వైద్యాన్ని అందించేందుకు ఈ సర్వే సహాయపడుతుందన్నారు. ఈ నెల 24 వరకు ఇంటింటి సర్వే కార్యక్రమం జరుగుతుందన్నారు.

ఎస్‌బీవీఆర్ డిగ్రీకళాశాల విద్యార్థుల ప్రభంజనం

బద్వేలుటౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : యోగివేమన యూనివర్సిటీ విడుదల చేసిన 1, 3, 5 సెమిస్టర్ ఫలితాల్లో బిజివేముల వీరారెడ్డి కళాశాల విద్యార్థులు యూనివర్సిటీ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించి ప్రభంజనం సృష్టించారు. మొదటి సెమిస్టర్‌లో నాగలక్ష్మి, నేహా, గంగాదేవి 10 జీపీఏ సాధించి యూనివర్సిటీ టాపర్స్‌గా నిలిచారు. బి.కాంకంప్యూటర్ లో భాగ్య, శరణ్య, కల్యాణి, అర్చన, శ్రావణి మరి కొంతమంది విద్యార్థులు 9.5సాధించి, ఉత్తమ ర్యాంకులు సాధించినందుకు విద్యార్థులను, అధ్యాపకులను ప్రిన్సిపాల్ అభినందించారు.

కాశినాయన ఆలయంలో అన్నదానం

కొండాపురం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌటిపల్లె గ్రామంలో కాశినాయన ఆలయం వద్ద బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మాఘపౌర్ణమి సందర్భంగా ఆలయంలోని గణపతి, అన్నపూర్ణేశ్వరి, కాశిరెడ్డి నాయన విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసి భజన నిర్వహించారు.

'సమస్యను పరిష్కరించాలి'

ఖాజీపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తహసీల్దారు సమస్య పరిష్కరించేవరకు దీక్ష కొనసాగిస్తానని, తనకేమైనా జరిగితే అధికారులదే బాధ్యతని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మీదేవి అన్నారు. బుధవారం సాయంత్రం నుంచి తహసీల్దారు కార్యాలయం వద్ద లక్ష్మీదేవి కుటుంబ సభ్యులతో కలిసి ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 581/2 సర్వే నంబరులోని ఆమె భూమిని రియల్‌స్టేట్ వ్యాపారులు ఆక్రమించుకుని అమ్ముకుంటున్నారన్నారు. ఈ విషయంపై పలుమార్లు తహసీల్దారు మహబూబ్‌బాషకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. దీంతో తాను ఆమరణ దీక్ష చేస్తున్నానన్నారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు దీక్ష చేస్తానన్నారు. కాగా రాత్రి 10:20 గంటలకు తహసీల్దార్ మహబూబ్ బాష,సీఐ మోహన్ వచ్చి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆమె దీక్ష విరమించారు.

ప్రతి రైతూ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

జమ్మలమడుగు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జమ్మలమడుగు ఏవో చంద్రశేఖర్‌రెడ్డి రైతులకు సూచించారు. బుధవారం జమ్మలమడుగు మండలంలోని కన్నెలూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన రైతులకు సూచనలు ఇచ్చారు.కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కలసపాడు..: మండలంలోని చెన్నుపల్లి గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో జాకీర్ షరీఫ్ పార్మర్ రిజిస్ట్రేషన్ గురించి రైతులకు తెలిపారు. రైతలందరూ రైతు గుర్తింపు సంఖ్య పొందుటకు రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ సహాయకుల వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు వై.కుమార్, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా సిద్దమ్మ తల్లి వార్షికోత్సవం



గోపవరం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : బద్వేలు - నెల్లూరు ప్రధాన రహదారిలో వెలసిన సిద్దమ్మ తల్లి 22వ వార్షికోత్సవాన్ని బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు కనులపండువగా దర్శించుకున్నారు. ఆ తల్లి వార్షికోత్సవంలో పలు రకాలైన సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

బీసీ కార్పొరేషన్ దరఖాస్తుకు 15న ఆఖరు

బ్రహ్మంగారిమఠం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం బీసీ కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్, ఈబీసీ,కాపు లబ్ధిదారులకు సబ్సిడీ రూపంలో రుణాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఫిబ్రవరి 15వతేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ వెంగమునిరెడ్డి తెలిపారు. ప్రభుత్వం ఫిబ్రవరి 12వతేదీ వరకు గడువు ఇవ్వగా, చాలా మంది దరఖాస్తు చేసుకోలేకపోవడం జరిగిందని మరో మూడురోజులు గడువు పెంచిందన్నారు.

వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న డీఎఫ్ఓ రాజశేఖర్

మైదుకూరు రూరల్ ,ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి) : వనిపెంట పరిధిలోని నల్లమల అడువుల్లో నివశిస్తున్న వన్యప్రాణుల సంరక్షణకు ప్రతి అధికారి కృషి చేయాలని డీఎఫ్ఓ రాజశేఖర్ అధికారుల సమావేశంలో తెలిపారు.మండలంలోని వనిపెంట ఫారెస్ట్ ఆఫీసులో బుధవారం డీఎఫ్ఓ అధికారులతో సమావేశం అయ్యారు. ఎర్రచందనం, వన్యప్రాణుల సంరక్షణపై అధికారులు శ్రద్ధ వహించాలని తెలిపారు.అడవులకు నిప్పు పెట్టడం వలన జరిగే నష్టాలపై ముద్దిరెడిపల్లె సుగాలి తాండలో గ్రామస్థులతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో వనిపెంట రేంజర్ ప్రణీత్‌రావు,నిఘా విభాగం రేంజ్ అధికారి రామ్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహా హారతికి అనూహ్య స్పందన





మాట్లాడుతున్న విరజానందస్వామి, శివకుమార్ స్వామి, మహా హారతిలో పాల్గొన్న మహిళలు

మైదుకూరు రూరల్ ,ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి) : హిందూ సమాజ సంఘటనకు సామూహిక మహా హారతి కార్యక్రమం నిదర్శనమని అచలానంద స్వామి ఆశ్రమ పీఠాధిపతి విరజానందస్వామి తెలిపారు. స్థానిక రాయల్ కూడలిలో బుధవారం మహా హారతి కార్యక్రమాన్ని హిందూవులు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మహిళలు తమ ఇంటి వద్దనే తులసిమాతకు పూజలు నిర్వహించారు. అనంతరం అందరూ కలిసి రాయల్ కూడలికి చేరుకొని మాఘ పౌర్ణమి సందర్భంగా చంద్రునికి మహా హారతి నిచ్చారు. అనంతరం విరజానంద స్వామి, ఈశ్వరిమాత పీఠాధిపతి శివకుమార్ స్వామి మాట్లాడుతూ 114 ఏళ్ల తరువాత వచ్చే మహా కుంభమేళ కార్యక్రమంలో భాగంగా ఈ రోజు మైదుకూరులో ఈ మహా హారతి కార్యక్రమం చేపట్టడం జరుగుతోందని తెలిపారు. కుంభమేళలో కోట్లాది మంది భక్తులు పుణ్యస్నానం చేస్తున్నారనితెలిపారు.నేడు మైదుకూరులో వేలాది మంది మహాహారతిలో పాల్గొన్నారన్నారు.